ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 21 జూలై 2025 | 5



వర్రీణకాలం!



వరుణకాలం వచ్చిందంటే వరికి ఇబ్బంది ఉండేది కాదు.. చినుకులు పడుతుంటే వరి చేలు పచ్చగా కళకళలాడుతూ కనిపించేవి..అందుకే మెట్టలో ఖచ్చితంగా ఒక పంట అనేవారు.. అయితే నేడు తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో వరి చేలు బీటలు తీస్తున్నాయి..మరో పక్క నాట్లు ఎండిపోతున్నాయి.. దీంతో అన్నదాత ఎలారా దేవుడా అంటూ దిక్కుతోచక కొట్టు మిట్టాడుతున్నాడు. మెట్ట ప్రాంతమైన గోకవరం మండలంలో సుమారు 12 వేల ఎకరాలకు పైగా వరి పంట ఇప్పటికే సాగు చేశారు. వరుణుడు కరు ణించకపోవడం, ఇరుగు పొరుగు నుంచి నీరొచ్చే దారిలేకపోవడం రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. గోకవరం, రంపయర్రంపాలెం,కామరాజుపేట, గాదెలపాలెం, వెదురుపాక, తిరుమలాయపాలెం తదితర గ్రామాల్లో పొలాలు నీరందక అర్రులు చాస్తున్నాయి.ఆయా ప్రాంతాల్లో పంటలను చేజిక్కుంచుకునేందుకు బాధిత రైతులు నానా తంటాలు పడుతున్నారు. మరో వైపు వ్యవసాయాధికారి అందుబాటులో లేకపోవ డంతో పంటను ఎలా దక్కించు కోవాలో తెలియక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తమకో దారి చూపాలంటూ వేడుకుంటున్నారు. **- గోకవరం**

శాకంబరిగా కోట సత్తెమ్మ

నిడదవోలు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢమాసం ఆఖరి ఆదివారం కావడంతో నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ శాకంబరిగా దర్శనమిచ్చారు. కోట సత్తెమ్మ తల్లి హోల్‌సేల్ కూరగాయల వర్తక సంఘం వారు రెండు టన్నులకు పైగా వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరి అలంకరణ చేశారు. ఆలయ ఆవరణ అంతా ఆకుకూరలు, కూరగాయలు, వేపాకు దండలతో పచ్చగా కనిపించేలా అలంకరించారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి దర్శనానికి తరలి వచ్చారు.ఆదివారం అమ్మవారికి రూ.2,61,460ల ఆదాయం లభించినట్టు దేవ స్థానం ఈవో తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి దుర్గేష్

ఆలయాన్ని ఆధునీకరిస్తాం : దుర్గేష్

ప్రతిష్ఠాత్మక అఖండ గోదావరి ప్రాజెక్ట్ అంతర్భాగంగా శక్తి స్వరూపిణి కోట సత్తెమ్మ దేవస్థానం అభివృద్ధికి కృషి చేయనున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అమ్మవారిని మంత్రి దుర్గేష్ దర్శించుకుని పూజలు చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి కోట సత్తెమ్మ దర్శనానికి భక్తులు రావడం గమనించామని .. ఆలయం అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించిందన్నారు.ఆలయాన్ని ఆధునీకరిస్తామన్నారు. ఆయ న వెంట ఆలయ ఈవో వి.హరిసూర్య ప్రకాష్, ఆలయ ఛైర్మన్ దేవులపల్లి రవి శంకర్, మునిసిపల్ కౌన్సిలర్లు పువ్వల రతీ దేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, చిలకల శారదాదేవి, కూటమి నాయకులు ఉన్నారు.

చల్లంగ చూడు తల్లీ!



కడియం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢం వచ్చిందంటే భక్తజనం సారె సమర్పించడం ఆనవాయితీ.. గ్రామదేవతలకు సారె సమర్పిస్తే చల్లంగ చూస్తారని భక్తుల నమ్మకం.. ఈ చిత్రంలోనే చూడండి.. అమ్మవారికి ఎంత తీపి కావిడ సమర్పించారో.. వేమగిరి ముత్యాలమ్మతల్లికి ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా సారె, చీర సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పుట్టింటి ఆడబడుచుగా కొలిచే అమ్మవారికి వివిధ రకాల స్వీట్లు, ఫలాలు తీసుకువచ్చి సారె సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వీట్లు, పువ్వులు, పండ్లను గ్రామమంతా పంచారు.



తగ్గిన గోదావడి

గోదావరి వరద తగ్గుముఖం పట్టింది.. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గోదావరి ప్రవాహం నెమ్మదించింది. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఒక్కసారి మాత్రమే 7 లక్షల క్యూసెక్కుల పైబడి వరద నీటిని విడుదల చేశారు. ఆదివారం 49 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

పులస..అధరహో..



ఈ పులస బరువెంతో తెలుసా.. అక్షరాలా 1.800 గ్రాములు.. అంటే రెండు కేజీల లోపే.. ధర ఎంతో తెలుసా రూ.22 వేలు.. యానాంలో చిక్కింది.

కోళ్లను మింగేసిన నల్లత్రాచు



నల్లత్రాచు పాము నాలుగు కోళ్లు మింగేసింది.. స్థానికులు గమనించి స్నేక్ స్నాచర్‌కు అప్పగించారు.

7

దేవుడా.. చూస్తున్నా!



ఉమ్మడి జిల్లాలోని ఒక ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



ఆలయాల భద్రతకు హైటెక్ నిఘా

నిన్నటి వరకూ ఆలయాల భద్రత దేవుడికెరుక. ఈ నేపథ్యంలో గత వైసీపీ ప్రభుత్వంలో దాడులు జరగని ఆలయం లేదు.. ప్రతి రోజూ ఏదో ఒక చోట ఆలయాల ధ్వంసం ఘటనలు జరుగుతూనే ఉండేవి.. ఎప్పుడు జరిగింది.. ఎలా జరిగిందనేది కనిపెట్టడం పోలీసులకు కత్తి మీద సాముగా ఉండేది.. అయితే కూటమి ప్రభుత్వం వచ్చింది.. దేవుడి సమస్యకు దారి చూపింది.. భద్రత కట్టుదిట్టం చేసే దిశగా చర్యలు చేపడుతోంది. ప్రతి ఆలయంలో నిఘా పటిష్టత దిశగా అడుగుల వేస్తోంది.

కార్పొరేషన్(కాకినాడ), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆలయాల భద్రత చర్యలను పరిశీలిస్తే అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రధాన ఆలయాలతో పాటు, చిన్న ఆలయాల వద్ద ఇదే పరిస్థితి. పలు ఆలయాల్లో నిఘా వ్యవస్థ నిద్దరోతోంది. రాత్రివేళల్లో అయితే కనీస బందోబస్తు కూడా ఉండడంలేదు.ఈ మేరకు ప్రభుత్వం ఆలయాలపై దృష్టి పెట్టింది.ఆలయాల భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసే దిశగా సీసీ కెమెరాలతో హైటెక్ భద్రత చర్యలు చేపడుతోంది. ఆలయాలపై విధ్వంస ఘటనలు, చోరీలు అరికట్టేందుకు ప్రభుత్వం నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. ఆలయ పరిసరాల్లో కెమెరాలు బిగించడంతో పాటు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నారు. ప్రభుత్వానికి నష్టం కలగకుండా, భక్తుల ఆస్తులను కాపాడేందుకు ఐటీ ఆధారిత భద్రతకు శ్రీకారం చుట్టారు.

ఆభరణాలకు బీమా..

ఉమ్మడి జిల్లాలోని దేవాలయాల్లో విలువైన వెండి, బంగారం,ఇతర ఆభరణాలకు బీమా తప్పనిసరి చేశారు. ఇటీవల జరుగుతున్న దొంగతనాలు,అగ్నిప్రమాదాల కారణంగా బీమా అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. దీంతో విలువైన ఆభరణాల న్ని బీమా చేయించాలని ఒక నిబంధన తెచ్చింది.ఈ మేరకు ఆలయాల్లో ఉన్న వెండి, బంగారం ఆభరణాలకు బీమా తప్పనిసరి చేశారు. విలువైన వస్తువులకు బీమా చేయించడం ద్వారా నష్టాన్ని క్లెయిమ్ చేసుకుని ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా భర్తీ చేయవచ్చు. ఉదాహరణకి గత వైసీపీ ప్రభుత్వంలో అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో రథం కాలిపోయింది. అప్పటికే ఆలయ ఈవో ఆ రథానికి బీమా చేయించారు. దీంతో ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి రూ.98 లక్షలు రికవరీ అయింది. ఉమ్మడి జిల్లాలో 1,182 ఆలయాల్లో విలువైన నగలు ఉండగా 700 దేవస్థానాలకే బీమా చేయించి నట్టు తెలుస్తోంది. మిగిలిన ఆలయాల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

ఆలయాలు 1,625

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,625 ఆలయాలు ఉన్నాయి.వీటిలో 764 ఆలయాల్లో మాత్రమే సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ ఉంది. మిగిలిన 861 ఆలయాలకు నిఘా వ్యవస్థ కొరవడింది. కాకినాడ జిల్లాలో 344 ఆలయాలకు 88 ఆలయాల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.మిగిలిన 256 ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు రూ.64 లక్షల ప్రతిపాదనలు చేశారు.తూర్పుగోదావరి జిల్లాలో 353 ఆలయాలు ఉన్నాయి. వీటిలో 230 ఆలయాల్లో సీసీ కెమెరా వ్యవస్థ ఉంది. మిగిలిన 123 ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు రూ.42 లక్షలతో అంచనా ప్రతిపాదనలు చేశారు. కోనసీమ జిల్లాలో 928 ఆలయాలకు 446 ఆలయాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి. మిగిలిన 482 ఆలయాలకు రూ.1.21 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

అవకతవకలకు అడ్డుకట్ట

పలు ఆలయాల్లో సీసీ కెమెరాలు పటిష్టంగా పనిచేస్తుండడంతో హుండీ లెక్కింపుల్లోను పారదర్శకత పెరిగింది. చోరీలు, అవకతవకలకు అడ్డుకట్ట పడుతోంది. సెలవు రోజులు, బ్రహ్మోత్సవాలు, పండుగల వేళల్లో వేలాదిగా వచ్చే భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు ఈ సాంకేతిక భద్రతా వ్యవస్థ కీలకంగా మారుతోంది. హుండీల లెక్కింపుల్లోనూ నిఘా వ్యవస్థ గట్టిగా పనిచేస్తోంది. ఆలయాలకు వచ్చే ఆభరణాల భద్రతకు నిఘా వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తోంది. అధికారులు పర్యవేక్షిస్తారు. ఇంత పటిష్టమైన భద్రత ఏర్పాట్లు ఉన్నప్పటికీ ఆలయాల్లో దొంగతనాలు దోపిడీలు జరిగితే వాటి పూర్తి బాధ్యత ఆలయ ఈవోలదే అని అధికారలు స్పష్టం చేశారు. సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యత ఈవోలదేనని స్పష్టం చేశారు. సీసీ కెమెరాలు పనిచేయకపోతే వచ్చే పరిణామాలకు ఈవోలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. మొబైల్ యాప్‌ల ద్వారా కెమెరాలను నిత్యం పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

- జిల్లాలో 1625 ఆలయాలు
- భద్రతకు సర్కారు ప్రణాళిక
- ఇప్పటికే 764 టెంపుల్స్‌లో నిఘా
- 861 ఆలయాల్లో ఏర్పాటుకు ప్లాన్
- రూ.2.27 కోట్లతో అంచనాలు
- ఆభరణాలకు బీమా తప్పనిసరి
- టెంపుల్స్ బాధ్యత ఈవోలదే

861 ఆలయాలకు.. రూ. 2.27 కోట్లు



గతంలో ఆలయాల్లో జరిగిన దోపిడీ కేసుల్లో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషించాయి. అందుకే 861 ఆలయాల్లో రూ.2.27 కోట్లతో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.ఆలయాల్లో ఆభరణాల బీమా బాధ్యత ఈవోలదే. సీసీ కెమెరా నిఘాలో ఏ విధమైన ఘటనలు జరిగినా బాధ్యత ఈవోలదే.

-డీఎల్‌వీ రమేష్‌బాబు, డిప్యూటీ కమిషనర్, దేవదాయ ధర్మదాయశాఖ

బీజేపీ జిల్లా నూతన కమిటీ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా నూతన కమిటీ (పదాధికారులు)ని జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆదివారం ప్రకటించారు. మొత్తం ఏడుగురు జిల్లా ఉపాధ్యక్షులు, ముగ్గురు జిల్లా ప్రధాన కార్యదర్శులు, ఏడుగురు జిల్లా కార్యదర్శులతో పాటు కోశాధికారి, సోషల్ మీడియా కన్వీనర్, ఐటీ కన్వీనర్లతో కూడిన కమిటీ పేర్లను విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షులుగా పేరిచర్ల సూర్యప్రభావతి, తనుబుద్ధి సూర్యభాస్కరరావు, రంగినీడి గంగాధర్, పాకలపాటి మంగతాయారు, బోడపాటి ముత్యాలరావు, మల్లిడి సురేంద్రరెడ్డి, కందికొండ రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా శెట్టిపల్లి శివ నాగరాజు, మద్దిపాటి రజని, ములగపాటి శివరామకృష్ణంరాజు, జిల్లా కార్యదర్శులుగా బండి సత్యప్రసాద్, పాతూరి రవిశంకర్, గోలు హేమతులసి, గెల్లా శ్రీను, బూరుగుపల్లి శివరామకృష్ణ, చిక్కాల మోహిని, స్వామి సూర్యకిరణ్, కోశాధికారిగా మంచెం విజయకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్‌గా మలపాక కృష్ణమోహన్, ఐటీ కన్వీనర్‌గా సుంకర శ్యాంబాబులను నియమించారు.

నేడు బిక్కవోలులో పీజీఆర్ఎస్‌కు కలెక్టర్

బిక్కవోలు, జూలై 20(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్(పీజీఆర్ఎస్)కు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి హాజరవుతారని ఎంపీడీవో వి. శ్రీనివాస్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ కలెక్టర్ అందుబాటులో ఉంటారన్నారు. మండల ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపడతారన్నారు.మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. జిల్లా కలెక్టరేట్ సోమవారం యథావిధిగా పీజీఆర్ఎస్ జరుగుతుందని పేర్కొన్నారు.

డ్రిప్.. నో గ్రిప్!




డ్రిప్ ఇరిగేషన్ పథకం ఏర్పాటు చేస్తున్న అధికారులు

- రైతుల చిన్నచూపు
- రాయితీలు ఉన్నా నిర్లక్ష్యం
- ముందుకు రాని రైతాంగం
- నెరవేరని సర్కారు లక్ష్యం
- నేటికీ అవగాహనా లోపమే
- 3,800 హెక్టార్లు లక్ష్యం
- 169.15 హెక్టార్లకే పరిమితం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీ ఎంఐపీ) అనే సూక్ష్మనీటి సాగు పథకం..దీనినే డ్రిప్ ఇరిగేషన్ అని అంటారు. డ్రిప్ ఇరిగేషన్ అంటే ప్రతి మొక్కకు ఓ పైపు ద్వారా నీటిని పంపిస్తారు. తుంపర్లు అంటే వాన తుంపర్లు పడినట్టు నీటిని జల్లే విధానం. తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసుకోవచ్చు. కనీసం 10 సెంట్ల భూమి ఉన్నా నీటి సదుపాయం ఉంటే చాలు రాయితీతో ఈ పథకాన్ని ఉపయోగించుకోవచ్చు.2003 నవంబరు నుంచి వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమలకు సంబంధించిన పంటలకు ప్రభుత్వం రాయితీ ద్వారా సూక్ష్మనీటి సాగులో భాగంగా డ్రిప్ (బిందు), తుంపర సేద్యాన్ని ప్రోత్సహిస్తోంది. నీటిని వృథా చేయకుండా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయవచ్చు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో మొత్తం 3800 హెక్టార్లలో బిందు సేద్యం, తుంపర సేద్యంను ప్రోత్సహించడం లక్ష్యంగా ఉంది. జిల్లాలో మండలాల వారీ సూక్ష్మనీటి సాగుపథకం నత్తనడకన సాగుతోంది. మొత్తం జిల్లాలో 2282 మంది రైతు 2753.64 హెక్టార్ల కోసం ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కానీ ఇప్పటి వరకూ కేవలం 111 మంది రైతులకు సంబంధించిన 169.15 హెక్టార్లలో మాత్రమే అమలైంది.రాజమండ్రి డివిజన్‌లో 722 మంది రైతులు 799.78 హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కానీ ఇప్పటి వరకూ 22 మంది రైతులకు చెందిన 28.75 హెక్టార్లలో మాత్రమే పథకం అమలైంది. కొవ్వూరు డివిజన్‌లో 1560 మంది రైతులు 1953.86 హెక్టార్లలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.అందులో ఇప్పటి వరకూ 89 మంది రైతులకు సంబంధించిన 140.40 హెక్టార్లలో మాత్రమే పథకం అమలైంది.కొ న్ని మండలాల్లో ఒకటి కూడా అమలు కాలేదు.

రాయితీ వివరాలు



చిన్న రైతులైన ఎస్సీ, ఎస్టీలకు 2 హెక్టార్ల వరకూ 100 శాతం రాయితీ ఇస్తారు. ఇతర చిన్నరైతులకు రెండు హెక్టార్ల వరకూ బిందు సేద్యానికి 90 శాతం రాయితీ అంటే రూ.2.18 లక్షలు వరకూ ఇస్తారు. సన్నకారు రైతులకు 2 హెక్టార్ల నుంచి 4 హెక్టార్ల వరకూ 70 శాతం రాయితీ అంటే రూ.3.10 లక్షలు ఇస్తారు. పెద్ద రైతులైతే 4 నుంచి 5 హెక్టార్ల వరకూ బిందు సేద్యానికి 50 శాతం రాయితీ అంటే రూ.4 లక్షల వరకూ ఇస్తారు. అందరు రైతులకు తుంపర సేద్యానికి 50 శాతమే రాయితీ..అంటే రూ.19 వేలు ఇస్తా రు.. కనీసం 10 సెంట్ల స్థలం ఉండి సాగు చేస్తున్నా పథకానికి అర్హులే. తప్పనిసరిగా నీటి సదుపాయం ఉం డాలి. రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలి. బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్ చేస్తారు. ఫీల్డ్ సర్వే చేసి, రైతు ఆధార్ కార్డు, పాస్‌బుక్ ఆధా రంగా ఎంపిక చేస్తారు. సబ్సిడీ మినహా మిగిలిన సొమ్మును చెల్లించిన తర్వాతే అధికారులు డ్రిప్ ఇరిగేషన్, తుంపర సేద్యం ఏర్పాట్లు చేస్తారు. ఏడేళ్ల వరకూ మరమ్మతులను ప్రభుత్వమే భరిస్తుంది.

మండలాల వారీ ఇలా..

మండలం	రిజిస్ట్రేషన్	హెక్టార్లు	మంజూరు	హెక్టార్లు
కొవ్వూరు	31	25.84	4	3.36
చాగల్లు	135	180.11	12	18.58
తాళ్లపూడి	45	68.51	4	7.29
నిడదవోలు	48	54.62	3	4.89
ఉండ్రాజవరం	3	3.18	0	0
పెరవలి	10	9	4	3.69
దేవరపలి	369	501.63	15	32.34
గోపాలపురం	383	481.43	9	12.79
నల్లజర్ల	536	629.54	38	57.46
సీతానగరం	81	78.74	1	0.69
కోరుకొండ	95	92.86	2	1.07
గోకవరం	90	100.50	2	1.19
రంగంపేట	275	285.10	13	18.3
రాజానగరం	116	160.53	1	1.13
రాజమండ్రి రూరల్	11	9.67	0	0
కడియం	22	14.64	2	1.36
అనపర్తి	7	14.51	0	0
బిక్కవోలు	25	43.23	1	5
మొత్తం	2282	2753.64	111	169.15



సెంట్రల్ జైలు వద్ద వైసీపీ శ్రేణుల హంగామా.. పోలీస్ వాహనంలో ఎంపీ మిథున్‌రెడ్డి తరలింపు

సెంట్రల్ జైల్‌కు ఎంపీ మిథున్‌రెడ్డి

లిక్కర్ స్కామ్‌లో ఏ4 - ఆగస్టు 1 వరకు రిమాండ్

రాజమహేంద్రవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : లిక్కర్ స్కామ్ కేసులో ఏ4, వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని ఆదివారం రాత్రి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. విజయ వాడ ఏసీబీ కోర్టు మిథున్‌రెడ్డికి ఆగస్టు 1వ తేదీ వరకూ రిమాండ్ విధించడంతో సిట్ టీమ్ డీజీ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 8.38 గంటలకు రాజమండ్రి సెంట్రల్ జైలుకు తీసుకొచ్చారు.జక్కంపూడి గణేష్, కొందరు యువకులు వైసీపీ జెండాలతో వచ్చి సెంట్రల్ జైలు ఎదురుగా రోడ్డుపై సుమారు 2 గంటల పాటు బైఠాయించి హంగామా సృష్టిం చారు.పోలీసులు ముందుగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయకపోవడంతో నేరుగా జైలు గేటు వరకూ వైసీపీ కార్య కర్తలు, నేతలు వచ్చారు. దీంతో పోలీసులు అప్రమత్తమై సెంట్రల్ జైల్ రోడ్ అటూ ఇటూ బ్లాక్ చేశారు. ఇన్‌చార్జి ఎస్పీ మురళీకృష్ణ నాయకత్వంలో అడిషనల్ ఎస్పీలు సుబ్బరాజు, చెంచురెడ్డి, ముగ్గురు డీఎస్పీలు, పలువురు సీఐలు, ఎస్ఐలు, సుమారు 60 మంది పోలీసులు అక్కడ మోహరించారు. నిఘా విభాగాలు రంగంలోకి దిగాయి. రోప్ పార్టీ వచ్చింది. సెంట్రల్ జైలు వద్ద సెక్షన్ 30 అమల్లో ఉందని.. రోడ్డుపై ఎవరూ ఉండవద్దని హెచ్చ రించారు. ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, అప్పిరెడ్డి సెంట్రల్ జైలు ప్రధాన గేట్ వద్దకు వెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీ సులు అడ్డుకు న్నారు.దీంతో కాసేపు వాగ్వాదం జరిగింది. అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ వారిద్దరినీ బయటకు పంపించారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్,మాజీ ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, తలారి వెంకట్రావు, సత్తి సూర్యనారాయణ రెడ్డి, గూడూరి శ్రీనివాస్ తదితరులు సెంట్రల్ జైలు వద్దకు వచ్చారు. ముందుగా పెద్ద హడావుడి చేసిన వైసీపీ శ్రేణులు మిథున్‌రెడ్డిని తీసుకొచ్చిన సమయంలో కిక్కురుమనక పోవడం గమనార్హం. జైలు అధికారులు వైసీపీ నేతలను ఎవరినీ లోపలకు అనుమతించ లేదు. జైలు అధికారులు లాంఛనాలు పూర్తిచేసి ఎంపీ మిథున్‌రెడ్డిని సెంట్రల్ జైలు రిమాండ్‌లో ఉంచారు.

బరువు 1.8 కిలోలు ధర రూ.22 వేలు

యానాం మార్కెట్‌లో పులస



యానాం మార్కెట్‌లో పులసతో మత్స్యకార మహిళ రత్నం

యానాం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): యానాంలో వేటకు వెళ్లిన మత్స్యకారుడి వలకు కిలో 800 గ్రాముల బరువు ఉన్న పులస చిక్కింది. దీనిని ఆదివారం యానాం మార్కెట్‌లో పోనమండ భద్రం, రత్నం దంపతులు రూ.22వేలకు పాడి దక్కించుకున్నారు. గౌతమి గోదావరిలో ఎర్రనీరు పోటెత్తిన సమయంలో పులసలు లభ్యమవుతాయి. వారం రోజుల క్రితం యానాం మార్కెట్‌కు తొలి పులస వచ్చి రూ.18వేల ధర పలికిన విషయం తెలిసిందే. అయితే రానున్న వరదకు మరిన్ని పులసలు దొరికే అవకాశం ఉందని మత్స్యకారులు చెప్తున్నారు.

రూ.20 లక్షల కరెన్సీ నోట్లతో..

సత్తెమ్మతల్లికి అలంకరణ



ముమ్మిడివరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలోని శ్రీసత్తెమ్మతల్లిని రూ.20లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆషాడమాసం ఆదివారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. గొలకోటి ఫణి, జీవీఎస్ బ్రహ్మానందం, గొలకోటి బాబి పులిహోర, అన్నవరం ప్రసాదం అమ్మవారికి సమర్పించి భక్తులకు ప్రసాదంగా వితరణ చేశారు. వేముల వెంకన్నబాబు చిన్నపిల్లలకు పాలు పంపిణీ చేశారు. గాలిదేవర రాధాకృష్ణ కుటుంబ సభ్యులు బూరెలను ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేశారు.


నాలుగు కోళ్లను మింగిన నల్ల తాచు



జనుపల్లిలో కోళ్లను మింగిన నల్లతాచును పట్టుకున్న గణేష్‌వర్మ

అమలాపురం రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం జనుపల్లి బాలయోగి ఘాట్ సమీపంలో మారిశెట్టి నాగభూషణం ఇంటి ఆవరణలో ఉన్న పాడుబడిన బాత్‌రూమ్‌లో ఉన్న నాలుగు కోడిపిల్లలను ఆరు అడుగుల నల్లతాచు ఆదివారం మింగేసింది. కోళ్లు చేస్తున్న శబ్దాన్ని గుర్తించిన ఆ కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లేసరికి కోళ్లు కనిపించకపోగా నల్లతాచు కదలలేని స్థితిలో ఉండడాన్ని గుర్తించారు. వెంటనే బాత్‌రూమ్‌కు గడియవేశారు. వెంటనే భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. కోళ్లను మింగిన తాచు కోడిపిల్లలను జీర్ణించుకోలేక ఒక్కొక్కటిగా ఆ బాత్‌రూమ్‌లోనే కక్కేసింది. అక్కడు చేరుకున్న వర్మ తాచు పామును చాకచక్యంగా పట్టుకుని డబ్బాలో బంధించి సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టాడు.

వ్యంగ్య చిత్ర పోటీల్లో రాముకు బహుమతి



మాడా రాము గీసిన కార్టూన్



అమలాపురం రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): శ్రీమామిడిపూడి రామకృష్ణయ్య స్మారక జాతీయస్థాయి వ్యంగ్య చిత్ర పోటీల్లో కోనసీమ జిల్లా బండారులంకకు చెందిన వ్యంగ్య చిత్రకారుడు మాడా రాము గీసిన కార్టూన్‌కు ప్రత్యేక బహుమతి లభించింది. నెల్లూరులో విశాలాక్షి విరజల్లుల పేరిట ఆదివారం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభలో వ్యంగ్య చిత్రాల ప్రదర్శన నిర్వహించి అభినందించారు.

వ్యక్తిపై ముగ్గురి దాడి

అట్రాసిటీ కేసు నమోదు

అమలాపురం టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యవహారంలో కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వెలువలపల్లికి చెందిన దోనిపాటి మహేష్‌పై రెండు పర్యాయాలు విచక్షణారహితంగా దాడి చేయడంతో గాయపడి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడిచేసిన ముగ్గురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ప్రకారం.. అమలాపురం పురపాలక సంఘంలో గతంలో పనిచేసి ప్రస్తుతం తునిలో పనిచేస్తోన్న ఉదయశంకరం అనే వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి అమలాపురం పరిసర ప్రాంతాలకు చెందిన యల్లమిల్లి విజయ్, కృష్ణ, మహేష్ నుంచి రూ.6.70లక్షలు వసూలు చేశాడు. పురపాలక సంఘంలో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఇప్పిస్తానని గత కొన్ని నెలలుగా నమ్మించాడు. ఈ వ్యవహారంలో మధ్య వర్తిత్వం వహించిన రావులపాలెం శ్రీశాంతి ఒకేషనల్ కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్న దోనిపాటి మహేష్‌ను ఈనెల 19వ తేదీ రాత్రి 7.30గంటల సమయంలో యల్లమిల్లి విజయ్, కృష్ణ, మహేష్ ఆటోలో ఎక్కించుకుని పేరూరు వై.జంక్షన్ నుంచి కామనగరువు సమీపంలోని కొబ్బరి తోటల్లోకి తీసుకువెళ్లి దాడి చేశారు. అక్కడి నుంచి అల్లవరం మండలం దేవర్లంక తీసుకెళ్లి అక్కడ మరోసారి దాడి చేశారు. గాయపడ్డ దోనిపాటి మహేష్‌ను బంధువులు అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటనా స్థలాన్ని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పరిశీలించి విచారణ చేపట్టారు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయ్, కృష్ణ, మహేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు.

వివాహిత హత్య కేసును సుమోటాగా స్వీకరించిన మహిళా కమిషన్

అమలాపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాజోలు మండలం బి.సావరంలో ఇటీవల జరిగిన మహిళ హత్య కేసును జాతీయ మహిళా కమిషన్ సుమోటాగా స్వీకరించింది. బి.సావరంలో ఓలేటి పుష్ప (22) షేక్ షమ్మా(22) అనే వ్యక్తితో సహజీవనం చేసింది. అయితే ఈనెల17న పుష్పను వ్యభిచారం చేయాలని షమ్మా పట్టుబట్టాడు. అందుకు పుష్ప ఒప్పుకోకపోవడంతో అతిదారుణంగా హతమార్చాడు. ఈ కేసుకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను 3 రోజుల్లో అందించాలని మహిళా కమిషన్ ఆదేశించింది. బాధిత మహిళా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చింది.

పట్టించు కో(య)..రా!


కనుమరుగవుతున్న కోయ భాష

ఆందోళన చెందుతున్న ఆదివాసీ సంఘాలు

నేడు విశ్వ కోయ (గోండి) భాషా దినోత్సవం



చింతూరు మండలంలోని ఓ పాఠశాలలో ఆదివాసీ విద్యార్థులు (ఫైల్)



కోయ వాచక పుస్తకం



కోయ భాషలో రచించిన పద్యాల పుస్తకం

(చింతూరు - ఆంధ్రజ్యోతి)

లిపి లేని భాషలు కాలక్రమంలో కనుమరగవుతున్నాయి. ఈ కోవలోకే కోయ భాష కూడా చేరుతుందన్న ఆందోళనను ఆదివాసీ సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2018 జూలై 21న దేశవ్యాప్తంగా ఉన్నటువంటి ఆదివాసీ మేధావులు ఢిల్లీలో సమావేశమయ్యారు. కనుమరుగవుతున్న విశ్వ కోయ (గోండి) భాషలను సంరక్షించుకోవాలని తీర్మానించుకున్నారు. ఆ మేరకు ప్రతి ఏటా జూలై 21న విశ్వ కోయ (గోండి) భాషా దినోత్స వాన్ని జరుపుకోవాలని నిచ్చయించుకున్నారు. నాటి నుంచి దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లో వ్యాప్తి చెంది ఉన్న ఆదివాసీలు వివిధ ఆదివాసీ సంఘాల నేతృత్వంలో విశ్వ కోయ భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కాగా ఈ దినోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలన్న ప్రధాన డిమాండ్ ప్రస్తుతం ఆదివాసీ సంఘాల నుంచి వినిపిస్తోంది. దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లో దాదాపు 3 కోట్ల మంది ఆదివాసీలు ఉన్నట్టు అంచనా. ప్రాథమిక విద్య మాతృ భాషలోనే బోధించాల న్నది ఆదివాసీ మేధావుల అభిప్రాయంగా ఉంది. ఉమ్మడి రాష్ట్రం నాటి కాలంలో ఆదివాసీ ప్రాంతాల్లో కొన్నేళ్లపాటు ఒకటి నుంచి 3 వరకు తరగతులు కోయ భాష లోనే బోధించారు. స్థానిక ఆదివాసీ యవతను ఉపాధ్యాయులుగా నియమించి గౌరవ వేతనం చెల్లించేవారు. నాడు రాష్ట్రంలోని 8 జిల్లాల్లోని 920 ఆదివాసీ ప్రాంత పాఠశాలల్లో 18,795 మంది ఆదివాసీ విద్యార్థులకు ఈ తరహా బోధన జరిగింది. ఖమ్మం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కోయ భాష, కర్నూలు, అనంత పురం సుగాలి భాష, విశాఖపట్నం జిల్లాలో కువి, కొండ భాష, శ్రీ కాకుళం, విజయనగరం జిల్లాల్లో సవర భాషలకు అనుగుణంగా కోయ భారతి పుస్తకాలను ముద్రించి బోధించారు. సహజంగా ఆదివాసీ చిన్నారులు వారి ఇళ్ల వద్ద మాతృ భాషలో మాట్లాడుతుంటారు. వారిని పాఠశాలల్లో చేర్పించి తెలుగు లేదా ఆయా రాష్ట్ర భాషల్లో బోధిస్తే పూర్తిగా అర్థంకాక చివరకు డ్రాప్ అవుట్స్ అవు తున్నారన్నది ఆదివాసీ సంఘాల వాదన. ఈ తరహా సమస్యను తొలగించాలంటే అంగన్‌వాడీ స్థాయి నుంచి మూడో తరగతి వరకు వారి మాతృ భాషలోనే బోధించాలని ఆదివాసీ మేధావులు అంటున్నారు. కాగా ఉమ్మడి రాష్ట్రంలో పడిన అడుగులు ఇప్పుడు మందగించాయన్న ఆరోపణ ఉంది.

సత్యదేవుడికి పట్టువస్త్రాల సమర్పణ



ఆవిర్భావ దినోత్సవాలకు పట్టువసాతిలు అందుకుంటున్న పండితులు

అన్నవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఈనెల 25, 26 తేదీలలో జరిగే ఆవిర్భావ దినోత్సవాలు పురస్కరించుకుని స్వామి,అమ్మవార్లకు.. ఇతర ఉపాలయాల్లో కొలువైన అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలను ఆదివారం విశాఖపట్నంకు చెందిన ఏ నాగేశ్వరావు అందజేయగా వాటిని ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యానికి ఈవో సుబ్బారావు దంపతులు అందించారు. కార్యక్రమంలో అర్చకులు సుధీర్ ఏఈవో భాస్కర్ తదితరులు ఉన్నారు.

లక్ష ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు

సత్యదేవుడి ప్రసాదం కొనుగోలుకు ఆదివారం భక్తులు బారులు తీరారు. ఆషాడమాసం చివరి ఆదివారం కావడంతో అధికసంఖ్యలో భక్తులు తలుపులమ్మ లోవకు తరలివెళ్లారు. తిరుగు ప్రయాణంలో అన్నవరం జాతీయ రహదారిపై ఉన్న సత్యదేవుడి నమూనాలయం, తొలిపావంచా వద్ద ఉన్న ప్రసాదం కౌంటర్లలో కొనుగోలు చేశారు. ఆదివారం ఒక్కరోజు సుమారు లక్ష ప్యాకెట్లను కొనుగోలు చేయగా వాటి ద్వారా సుమారు రూ.20లక్షల ఆదాయం లభించింది.



సత్యదేవుడి ప్రసాదం కోసం బారులు తీరిన భక్తులు

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీ ప్రత్యేక పూజలు



అన్నవరంలో ఏడీకి వేదాశీర్వచనం అందజేస్తున్న పండితులు

అన్నవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.వి.రమణమూర్తి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రామకృష్ణ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలందజేశారు.

పంట కాలువలో వృద్ధురాలి ఆత్మహత్య



అచ్చియ్యమ్మ మృతదేహం

రాయవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పంట కాలువలో వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా రాయవరం రాజేశ్వరకాలనీకి చెందిన కొండవిల్లి అచ్చియ్యమ్మ (70) బోదకాలు, ఆస్తమాతో బాధపడుతుంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. రాయవరంలో ఉన్న కుమార్తె ఇంటి వద్ద నుంచి ఆదివారం ఉదయం లొల్లలో హోమియోపతి మందులు తెచ్చుకునేందుకు వెళ్తున్నట్టు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అచ్చియ్యమ్మ మండపేట- రామచంద్రపురం ప్రధాన కాలువలో మాచవరం వద్ద కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాలువలో వృద్ధురాలు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రాయవరం పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ ఆధ్వర్యంలో కాలువలో మృతదేహాన్ని బయటకు తీసి శవ పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి అల్లుడు మాడా ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

దొరకని ఇంజనీరింగ్ విద్యార్థి ఆచూకీ

గోదావరిలో కొనసాగుతోన్న గాలింపు చర్యలు



గౌతమి గోదావరిలో గాలింపు నిర్వహిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం

ఆత్రేయపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చి గోదావరిలో శనివారం ఉదయం స్నానమాచరిస్తుండగా ఖమ్మం జిల్లాకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి పామర్తి దినేష్ (22) గల్లంతైన విషయం విదితమే. శనివారం నుంచి ఆదివారం సాయంత్రం వరకు సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది, ఎస్డీఆర్ఎఫ్ బృందం 3 బృందాలుగా విడిపోయి గౌతమి గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు. ఖమ్మం నుంచి వచ్చిన బంధుమిత్రులు గోదావరి పరిసర ప్రాంతాల్లో గాలిస్తున్నారు.

సాధారణ స్థాయిలో గోదావరి ప్రవాహం

49 వేల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవాహం సాధారణ స్థాయిలో కొనసాగుతోంది. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 49,422 క్యూసెక్కులు ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 5వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 6700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 12.70 అడుగులుగా నమోదైంది.

మోతుగూడెంలో దర్శకుడు బోయపాటి సందర్శన

మోతుగూడెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో ఆదివారం ప్రముఖ సినీ దర్శకుడు బోయపాటి శ్రీను పర్యటించారు. తన బృందంతో కలిసి అఖండ2 సినిమా చిత్రీకరణలో భాగంగా పొల్లూరు జలపాతం, ధారాలమ్మ గుడి వద్ద పిక్నిక్ స్పాట్‌తో పాటు కొన్ని ప్రదేశాలను సందర్శించారు.



పిక్నిక్ స్పాట్‌లో బృందంతో వెళ్తున్న దర్శకుడు బోయపాటి శ్రీను

'తల్లికి వందనం' ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తింపచేయాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

అమలాపురం టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ సూచించారు. కోనసీమ జిల్లా అమలాపురం ఎస్టీయూ జిల్లాశాఖ కార్యాలయం వద్ద ఆదివారం సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ తల్లికి వందనం తీసుకున్న తల్లులు ఎందరో తమ బిడ్డలను తీసుకుని రాజమార్గంలో ప్రైవేటు పాఠశాలల్లో చేరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4600 పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్మెంట్‌లో ఉండడం విచారకరమన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం 11వ పీఆర్సీ బకాయిలు, టీఏ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు, పీఎఫ్ లోన్స్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. 12వ పీఆర్సీ వేసేందుకు జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు తక్షణం జాయింట్ యాక్షన్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేసి రోడ్డు మ్యాప్ ఇవ్వాలన్నారు. యాప్‌ల భారం నుంచి ఉపాధ్యాయులకు మోక్షం కల్పించాలన్నారు. ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శి సరిదె సత్యపల్లంరాజు తదితరులు ఉన్నారు.

'గృహ నిర్మాణ సంస్థ' అధ్యక్షుడిగా చక్రవర్తి

కొవ్వూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజనీర్ల అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కేఎస్ చక్రవర్తి నియమితులయ్యారు. ఆదివారం విజయవాడ యూటీఎఫ్ భవనంలో అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. ఎన్.మల్లిఖార్జున రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా కొవ్వూరు పట్టణ హౌసింగ్ ఏఈ కేఎస్ చక్రవర్తి, జనరల్ సెక్రటరీగా చిత్తూరుకు చెందిన ఎస్.శ్రీరాములురెడ్డి, కోశాధికారిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన డి.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. నూతనకార్యవర్గంలో 26 జిల్లాలకు చెందిన వారికి చోటు కల్పించారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలియజేశారు.



రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజనీర్ల అసోసియేషన్ కమిటీ సభ్యులు

దైవ దర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

కొంతమూరులో 18 కాసుల బంగారం, 3.5 కిలోల వెండి చోరీ



ఆధారాలు సేకరిస్తున్న సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్

రాజానగరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో భద్రపర్చిన బంగారు ఆభరణాలు, వెండి వస్తు సామగ్రితో పాటుగా నగదును అపహరించుకుపోయారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంతమూరు గ్రామానికి చెందిన గరిమెల్ల పవన్‌కుమార్ శర్మ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 15న శ్రీశైలం మల్లిఖార్జునస్వామి దర్శనానికి వెళ్లారు. అనంతరం 20వ తేదీ ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు కూడా తెరిచి ఉన్నాయి. బీరువాలో భద్రపర్చిన 18 కాసుల బంగారు ఆభరణాలు, 3.5 కిలోల వెండి వస్తువులతో పాటు రూ.10 వేలు నగదు అపహరణకు గురైనట్టు గుర్తించి పవన్‌కుమార్ రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్ట్

మూడున్నర కిలోల గంజాయి, 6 మోటారుసైకిళ్ల స్వాధీనం



గంజాయితో నిందితులను పట్టుకున్న పోలీసులు

కడియం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక శ్మశానవాటిక సమీపంలో గంజాయి విక్రయం జరుగుతుందని డీఎస్పీ ఎస్.భవ్యకిషోర్‌కు సమచారం రావడంతో ఎస్ఐ బీఎన్‌డీ దుర్గాప్రసాద్ సిబ్బందితో అక్కడికి వెళ్లారు. ఐదుగురు నిందితులు, ఓ మైనర్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.15వేల విలువైన మూడున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాజానగరం, రాజమ్మంగి, గండేపల్లి, తణుకు, బొమ్మూరు, ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దొంగిలించిన 6 మోటారుసైకిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసై జల్సా ఖర్చుల కోసం గంజాయి అమ్మకాలు, దొంగతనాలు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. ఐదుగురు ఏజెన్సీ ప్రాంతం కేడీ పేట గ్రామం నుంచి గంజాయిని తీసుకొచ్చి ప్యాకెట్లుగా తయారు చేసి అమ్ముతున్నారని పేర్కొన్నారు.

కోడిపందేలు ఆడుతున్న ఆరుగురి అరెస్ట్

నిడదవోలు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కోరుమామిడిలో ఆదివారం కోడిపందేలపై సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ సుందరరావు సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1150 నగదు, 3 బైకులు, 2 కోళ్లు, 4 కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

పొట్ట కూటికి పాట్లు!

కాకినాడ జిల్లా తలుపులమ్మ లోవలో పొట్ట కూటి కోసం శరీరమంతా రంగు వేసుకుని బొమ్మలుగా మారిన చిన్నారుల చిత్రాలే ఇవి.



– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

'లోవ'లో భక్తుల కోలాహలం

రూ.16.74 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ

తుని రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఆషాడ మాసం చివరి ఆదివారం కావడంతో భక్తులు పోటెత్తారు. క్యూలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆరు బయట వంటవార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. తుని రూరల్ సీఐ చెన్నకేశరావు ఆధ్వర్యంలో సుమారు 100 మంది బందోబస్తు నిర్వహించారు. ఆలయానికి రూ.16.74 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాధరాజు తెలిపారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా సురేంద్రరెడ్డి



సురేంద్రరెడ్డి, హేమతులసి, వెంకట సురేష్

అనపర్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ప్రకటించిన జిల్లా కార్యవర్గంలో అనపర్తికి చెందిన ముగ్గురికి పదవులు లభించాయి. ఇప్పటి వరకు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ములగపాటి శివరామకృష్ణంరాజును జిల్లా జనరల్ సెక్రటరీగాను, రామవరం గ్రామానికి చెందిన మల్లిడి సురేంద్రరెడ్డిని జిల్లా ఉపాధ్యక్షుడిగాను, కుతుకులూరు గ్రామ సర్పంచ్ గొల్లు హేమతులసిని జిల్లా కార్యదర్శిగాను నియమించారు. వీరు పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం జిల్లా కార్యవర్గంలో స్థానం కల్పించింది. ఈ సందర్భంగా వీరు రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

కాకినాడ జిల్లా కార్యదర్శిగా సురేష్

గోకవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ కాకినాడ జిల్లా కార్యదర్శిగా గోకవరం గ్రామానికి చెందిన కోన వెంకటసురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం తనకు నియామక పత్రాలు అందినట్టు ఆయన తెలిపారు. గతంలో సురేష్ బీజేపీ జగ్గంపేట అసెంబ్లీ నియోజక వర్గం కో కన్వీనర్‌గా పని చేశారు. జిల్లాలో అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

వృద్ధుల సంక్షేమంపై కళాజాత ప్రదర్శనలు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల సంక్షేమం, వారికి ప్రభుత్వ పరంగా అందిస్తున్న సహాయ సహకారాలపై కళాజాత ప్రదర్శనల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు ఆదివారం రాజమండ్రి రైల్వేస్టేషన్ ఆవరణలోను, పుష్కర ఘాట్ వద్ద ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వయో వృద్ధుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సహాయక కార్యక్రమాలు, పథకాలు, సౌకర్యాల గురించి కళాజాత ప్రదర్శనల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతున్నదని విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకుడు శ్రీనివాసరావు తెలిపారు.

ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి

ఆన్‌లైన్ ఆటో యూనియన్ యాప్ ప్రారంభంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



ఆన్‌లైన్ ఆటో యాప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సంక్షేమానికి, భద్రతకు టీడీపీ కట్టుబడి వుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో టీఎన్‌టీయూసీకి అనుబంధంగా ఆదివారం రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్ రీజెన్సీలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ ఆటో యూనియన్‌కు సంబంధించిన యాప్ ఆవిష్కరణ జరిగింది. దీనికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ టీడీపీ కార్మిక పక్షపాతి అని అన్నారు. నియోజకవర్గాలకు అతీతంగా ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఆటో కార్మికుల ఆదాయం పెరిగేందుకు దోహదపడేలా యాప్ రూపొందించడం అభినందనీయమన్నారు. అనంతరం యాప్‌ను రూపొందించిన కె.రామచంద్రరావును ఎమ్మెల్యే, సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు, కాశి నవీన్‌కుమార్, నల్లం శ్రీనివాస్,ఉప్పులూరి జానకిరామయ్య, బుడ్డిగ రాధా, చాపల చినరాజు, ది రాజమండ్రి ఆన్‌లైన్ ఆటో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండ రామచంద్ర, మడగల చిరంజీవి, కాండ్రకోట వాసు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా లెక్చరర్ పోస్టుల భర్తీ రాతపరీక్ష



పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ద్వారా లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన రాతపరీక్ష ప్రశాంతంగా సజావుగా ముగిసిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని లూథర్‌గిరిలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రాన్ని జేసీ సందర్శించి పరీక్షా ప్రక్రియను పరిశీలించారు. మొత్తం రెండు షిఫ్టుల్లో 759 మంది అభ్యర్థులకు పరీక్ష కోసం ఏర్పాట్లు చేయగా, 414 మంది హాజరయ్యారని మిగిలిన వారు గైర్హాజరయ్యారని తెలిపారు. ఏపీపీఎస్సీ అధికారి ఎం.జగదీష్, సహ చీఫ్ సూపర్‌వైజర్ ఎస్‌వీ గణేష్ జేసీ వెంట ఉన్నారు.

నల్లమిల్లి సనాతనికి లేప్రోస్కోపీ సర్జన్ పట్టా



పట్టా స్వీకరిస్తున్న డాక్టర్ సనాతని

అనపర్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుమార్తె డాక్టర్ నల్లమిల్లి సనాతని ఢిల్లీలోని ఎస్టిమేటెడ్ వరల్డ్ లేప్రోస్కోపీ ఆసుపత్రి నుంచి ఫెలోషిప్ ఇన్ మినిమల్ ఏక్సెస్ సర్జరీ పట్టా పొందారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి ప్రతినిధుల నుంచి ఆమె ఈ పట్టా పొందారు. ఈ సందర్భంగా సనాతని మాట్లాడుతూ వైద్య రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పేదలకు వైద్య సేవలందించాలన్నదే తన సంకల్పమన్నారు.

కూటమి పాలనలో గ్రామాలు అభివృద్ధి



మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న రవిరామ్‌కిరణ్

ధవళేశ్వరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): గ్రామాలు కూటమి పాలనలో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ అన్నారు. ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ధవళేశ్వరంలోని 108వ బూత్ పరిధిలో చేపట్టారు. నియోజకవర్గ పరిశీలకుడు డొక్కా నాథ్‌బాబు, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంవత్సర కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను రవిరామ్‌కిరణ్ వివరించారు. చేపట్టబోతున్న అభివృద్ధి పనులను తెలియజేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మచ్చేటి ప్రసాద్, పండూరి అప్పారావు, నీలి కోటేశ్వరరావు,ఆళ్ల ఆనందరావు, పుక్కెళ్ల రాజు, అడపా శ్రీను, నాళ్ళ రమేష్, బత్తిన ఏడుకొండలు, రామస్వామి పాల్గొన్నారు.

ఆర్య వైశ్యుల సేవాభావం స్ఫూర్తిదాయకం

దివాన్‌చెరువు, జూలై20 (ఆంధ్రజ్యోతి): సమాజంలో తమ సంఘీయులతోపాటు మిగిలిన కులాల అభ్యున్నతికి కృషిచేస్తున్న ఆర్యవైశ్యుల సేవాభావం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. దివాన్‌చెరువులోని కళ్యాణ మండపంలో వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ మెడికాన్ సమావేశం ఆదివారం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారన్నారు. వైశ్యులను రాజకీయంగా ప్రోత్సహించడానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ ద్వారా చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. శ్రీకాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆర్యవైశ్యులు కష్టపడి పనిచేస్తూ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో తమ వంతు పాత్ర పోషిస్తున్నారన్నారు. వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎరుకుళ్ల రామకృష్ణ మాట్లాడుతూ వచ్చే డిసెంబరులో హైదరాబాద్‌లో ఐకాన్ పేరిట సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తమ క్లబ్స్ సేవాకార్యక్రమాలను వివరించారు. అతిథులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సిద్ధా సూర్యప్రకాశరావు, గార్లపాటి శ్రీనివాస్, సుజాత, రమేష్ బాబు, కె.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

అనపర్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని వెంకటరత్నపురంలో ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యాడు. ఎస్ఐ శ్రీను నాయక్, బాధితురాలి వివరాల ప్రకారం.. వెంకటరత్నపురంలో నివాసం ఉంటున్న కర్రి ఆదిలక్ష్మి అనే వృద్ధురాలు ఉదయం 6గంటల ప్రాంతంలో వీధి చివరన ఉన్న చెత్త కుండీ వద్దకు చెత్తను వేసేందుకు వెళ్లింది. అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న అగంతకుడు ఆమె మెడలోని గొలుసును తెంపుకుని ఉడాయించాడు. దీంతో వృద్ధురాలి కేకలు విన్న చుట్టుప్రక్కల వారు వచ్చి వెతికినా ఫలితం లేకపోయింది. దొంగిలించిన గొలుసు సుమారు 44 గ్రాములు కాగా దాని విలువ సుమారు మూడున్నర లక్షలు ఉంటుందని వృద్ధురాలు పోలీసుల వద్ద వాపోయింది. ఎస్ఐ శ్రీను నాయక్ పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను సేకరిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నైవోదయం

గోకవరంలో ఆగని సారా తయారీ, విక్రయాలు

- యథేచ్ఛగా సారా బట్టీల నిర్వహణ
- వెదురుపాకలో యువకులే నిర్వాహకులు
- రోజూ 4 వేల లీటర్ల పైబడి తయారీ
- కన్నెత్తి చూడని ఎక్సైజ్, పోలీసులు



గోకవరం మండలం ఇటికాయిలపల్లిలో సారా బట్టీలు

గోకవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలంలోని పలు గ్రామాల్లో సారా తయారీ, విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. బహిరంగంగానే అమ్మకాలు సాగుతున్నా పోలీస్, ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించడం లేదని మండల వాసులు విమర్శిస్తున్నారు. సారా తయారీదారుల్లో చైతన్యం నింపి తయారీ, విక్రయాలను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం నవోదయం 2.0 పేరిట కార్యక్రమాలను చేపట్టినా ఇక్కడి అధికారుల నిర్లక్ష్య ధోరణితో ఫలితం కానరావడం లేదు. మండలంలోని కొన్ని గ్రామాల్లో సారా తయారీ కుటీర పరిశ్రమగా తయారైంది. వ్యాపారం మూడు సీసాలు, ఆరు ప్యాకెట్లుగా సాగుతోంది.

ఆ గ్రామాల్లో జోరు

మండలంలోని వెదురుపాక, మల్లవరం, ఇటికాయిలపల్లి, రంపయర్రంపాలెం, తిరుమలాయపాలెం గ్రామాల్లో సారా బట్టీలు ఎక్కువగా ఉన్నాయి. వెదురుపాకలో సారా విక్రయాలు రాత్రింబవళ్లు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. నీటి నిల్వలు పుష్కలంగా ఉండే మామిడి తోటల్లోను, కొండ ప్రాంతాల వద్ద భారీ ఎత్తున బట్టీలు నిర్వహిస్తున్నారని పలువురు అంటున్నారు. కొందరు యువకులే తయారీ, విక్రయాలు నిర్వహిస్తుండడం గమనార్హం. ఇక్కడ కొన్నేళ్లుగా తయారీతో పాటు, విక్రయాలు జోరుగా సాగుతున్నా అధికారులు ఆ గ్రామం వైపు కన్నెత్తి చూడరనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి రోజూ ఈ ఒక్క గ్రామం నుంచే నాలుగైదు వేల లీటర్ల సారా తయారీ జరుగుతున్నట్టు సమాచారం. ఇక్కడ నుంచే గోకవరం, కోరుకొండ, గండేపల్లి మండలాల్లోని పలు గ్రామాలకు రవాణా జరుగుతుంది. ఇటీవల ఇటికాయిలపల్లి, రంపయర్రంపాలెం గ్రామాల్లో సారా బట్టీలపై స్థానిక పోలీసులు దాడి చేసి సుమారు 50లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 1000 లీటర్లకు పైగా బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో సారా తయారీ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

లాభసాటి పంటలపై దృష్టి సారించాలి

ఉద్యాన, వ్యవసాయశాఖాధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ



అధికారులతో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): లాభసాటి పంటల సాగుపై దృష్టి సారించే విధంగా ఉద్యాన, వ్యవసాయాధికారులు రైతులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాలకు చెందిన ఉద్యాన, వ్యవసాయ శాఖాధికారులతో ఆదివారం ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లాభదాయకమైన పంటల సాగుపై మక్కువ చూపేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చాగల్నాడు సీతాఫలాలకు గతంలో మంచి గుర్తింపు ఉండేదని, వాటికి పూర్వ దశ తీసుకురావాలన్నారు. అలాగే జీడిమామిడి, మామిడి, నిమ్మ, నారింజ, సపోట తదితర పండ్ల తోటల సాగులో అధిక దిగుబడులు సాధించే విధంగా రైతులకు ఎప్పటికప్పుడు శిక్షణ, అవగాహన కల్పించాలన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ఫలితాలు పొందలేని వ్యవసాయం కంటే ఏ పంటలు పండిస్తే లాభసాటి అవుతుందో రైతులకు వివరించాలన్నారు.సరైన అవగాహన కల్పించకపోవడం వల్లే మూస విధానంలో పండిస్తున్నారని, ఈ పరిస్థితి మారాలని సూచించారు. లాభాలు కురిపించే ఆయిల్ పామ్ వంటి పంటలపై కూడా మక్కువ చూపేలా ఉద్యానశాఖాధికారులు అవగాహన కల్పించాలన్నారు కలవచర్లలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుతో ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని కూడా పండ్ల తోటల రైతులకు వివరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఉద్యాన, వ్యవసాయశాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

తాడేళ్లమ్మకు బోనాలు



పాలచర్లలో బోనాలు సమర్పిస్తున్న మహిళలు, తాడేలమ్మ తల్లి

దివాన్‌చెరువు, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం పాలచర్ల గ్రామ దేవత మాతృశ్రీ తాడేలమ్మ తల్లి ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని, ఆలయాన్ని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు. మహిళా భక్తులు బోనాలను తలపై ఎత్తుకుని ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దుర్గమ్మకు ఆషాఢం సారె..

కోరుకొండ, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధురపూడిలో శ్రీ కనకదుర్గమ్మకు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ఆషాఢ మాసం సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం గ్రామంలోని మహిళలతో కలిసి దుర్గమ్మకు సారె నివేదించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ఆలయ కమిటీసిబ్బంది పాల్గొన్నారు.



మధురపూడిలో దుర్గమ్మకు బత్తుల వెంకటలక్ష్మి పూజలు

చినకొండేపూడిలో వెదుళ్లమ్మకు..

సీతానగరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలం చినకొండేపూడి గ్రామ దేవత శ్రీ వెదుళ్లమ్మకు ఆషాఢమాసం సందర్భంగా 108 వంటకాలతో సారె సమర్పించారు. ఆదివారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన వస్త్రాలు అందించి 108రకాల వంటకాలతో సారెను సమర్పించారు. గరగ నృత్యాలు, కోలాటం, తీన్‌మార్ వాయిద్యాల నడుమ సారెను ఊరే గింపుగా తీసుకెళ్లి అమ్మవారికి నివేదించారు.



చినకొండేపూడిలో వెదుళ్లమ్మ తల్లి

తొర్రేడులో ఒనువులమ్మకు..

రాజమహేంద్రవరం రూరల్ జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్రేడు గ్రామంలో ఒనువులమ్మ తల్లి ఆలయంలో గ్రామస్థులు ఆషాఢం సారె సమర్పించారు. ఆదివారం 150 రకాల స్వీట్స్, పండ్లతో గ్రామ పురవీధుల్లో మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గరగ నృత్యాలతో ఊరేగింపుగా అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు సారెతో అమ్మవారి ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. చిన్నారులు గరగ నృత్యాలకు అనుగుణంగా డాన్సులు చేస్తూ సందడి చేశారు. వేద పండితుల అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు సారెను ప్రసాదంగా పంపిణీ చేశారు. సాయంత్రం గీతావికాస్ భజన మండలి సభ్యులతో భజన కార్యక్రమం నిర్వహించారు.



తొర్రేడులో ఒనువులమ్మకు సారె సమర్పిస్తున్న దృశ్యం

జవహర్ ఫ్లెక్సీలు చించిన వాళ్లను అరెస్టు చేయాలి

లేకుంటే 24న ఎస్పీ కార్యాలయం ముట్టడి.. ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుమర్తి చిన్న మాదిగ

రాజమహేంద్రవరం సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం పశివేదల గ్రామంలో ఆదివారం ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేఎస్ జవహర్ ఫొటోలతో ముద్రించిన ఫ్లెక్సీలను కొందరు వ్యక్తులు అకారణంగా చించివేయడం దారుణమని ఈ ఘటనకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలని మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుమర్తి చిన్న మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జవహర్ ఫ్లెక్సీని చించివేసి దాని స్థానంలో మరో ఫ్లెక్సీని పెట్టడం దురదృష్టకరమన్నారు. టీడీపీలోనే ఒక వర్గం ఇలా చేయడం శోచనీయమని, పెండ్యాల అచ్చిబాబు అనుచరులే ఇలా చేస్తున్నట్టు అనుమానం ఉందన్నారు. గతంలో కూడా ఇలానే చేసి అవమానించారని, ఇప్పుడూ అదే మాదిరిగా చేయడం చూస్తే కావాలనే రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోందన్నారు. ఈ నెల 23వ తేదీలోగా నిందితులను పోలీసులు గుర్తించి అరెస్టు చేయాలని లేకుంటే 24న జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. సమావేశంలో బోయిలపల్లి సుందరయ్య, దారా యేసురత్నం, పెనుమాక సురేష్, ఖండవల్లి లక్ష్మి, ముప్పిడి రాము, ఈతల పవన్, పోసుపో వినోద్‌బాబు, పౌరోజు పండు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ చట్టంపై

అవగాహన అవసరం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): జంతు సంరక్షణ చట్టంపై అందరికీ అవగాహన ఉండాలని యానిమల్ రెస్క్యు ఆర్గనైజేషన్, హ్యూమన్ వరల్డ్ ఫర్ యానిమల్స్ ఇండియా ఫౌండేషన్, సుమతి నాధాజీ జీవదయ ట్రస్టులు స్పష్టం చేశాయి. ఆదివారం ఈ సంస్థలకు చెందిన ప్రతినిధులు రాజమహేంద్రవరంలో జంతు సంరక్షణ చట్టలపై అవగాహన సమావేశం నిర్వహించాయి. పలువురు జంతు ప్రేమికులు ఈ సమావేశంలో తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

కిసాన్ దివస్ వేడుకలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కిసాన్ దివస్ వేడుకలు జరిగాయి. సీతంపేట బ్రాంచ్‌లో జరిగిన కార్యక్రమంలో ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ జనరల్ మేనేజరు ఎం.సుబాకర్, జోనల్ మేనేజరు నికేష్‌కుమార్ సిన్హా ముఖ్యఅతిథులుగా విచ్చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



రాజమహేంద్రవరం సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మునిసిపల్ టౌన్ హైస్కూల్‌లో 1975-76 విద్యాసంవత్సరానికి చెందిన విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం స్థానిక రజక కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాడు తరగతి గదుల్లో చేసిన అల్లరి చేష్టలను, మధురానుభూతులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. నాటి ప్రధానోపాధ్యాయుడు వి.సీతారామయ్యను సత్కరించారు. కార్యక్రమంలో మధుసూదన్, లక్ష్మణతీర్థ, రామ్‌కుమార్, అడ్డూరి ప్రకాశరావు, నాగేంద్రకుమార్, ఎంవీ రామారావు పాల్గొన్నారు.

ఇన్విటేషన్ చెస్ పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ చెస్ డే సందర్భంగా ఆదివారం రాజమహేంద్రవరంలోని కాల్ ఫ్యూజన్ చెస్ అకాడమీలో ఇన్విటేషన్ చెస్ పోటీలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో సుమారు 150 మంది చిన్నారులు పోటీ పడ్డారని నిర్వాహకులు తెలిపారు. అకాడమీ డైరెక్టర్ విత్తనాల కుమార్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ పోటీల్లో రోషిత నాయుడు, రుత్విక్, వాకలపూడి లతిక మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



అశోక్‌గజపతి రాజుకు చైతన్యరాజు జ్ఞాపిక

గోవా గవర్నర్‌ను కలిసిన

జీజీయూ చాన్సలర్

రాజానగరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతిరాజును గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) ఆదివారం విజయనగరంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా వేసి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జీజీయూ ప్రోచాన్సలర్ కేవీబీ రాజు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నల్లమిల్లిని సత్కరిస్తున్న దృశ్యం


ఎమ్మెల్యే నల్లమిల్లికి సత్కారం

అనపర్తి, జూలై 20(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో రూ.200 ఉన్న గ్రీన్ ట్యాక్స్‌ను రూ.24 వేలకు పెంచడంతో లారీ యజమానులకు ఈ టాక్స్ చెల్లించడం గుదిబండగా మారిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ట్యాక్స్‌ను 4వేలకు తగ్గించింది. దీంతో ఆదివారం రామవరంలో అనపర్తి, బిక్కవోలు లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: జూనియర్
సూర్యమినీ	: ఓ భామ అయ్యో రామ
సూర్యప్యాలస్	: కొత్తపలిలో ఒకప్పుడు
స్వామి	: కుబేర
శివజ్యోతి	: వర్జిన్ బాయ్స్, తమ్ముడు
అనుశ్రీ(సాయికృష్ణ)	: మై బేబీ
రాజా	: ఏ మాయ చేసావే
ఊర్వశి	: 3బీహెచ్‌కే
రంభ	: ఎఫ్-1 ది మూవీ, మార్గన్
మేనక	: సూర్య S/O కృష్ణన్
అప్సర	: ఏ మాయ చేసావే
కుమారి	: ----
అశోక	: జూనియర్
పీఎస్ మహల్(నామవరం)	: జూనియర్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: జూనియర్
వెంకటసూర్య(కడియం)	: -------
సత్యగౌరి (అనపర్తి)	: మార్గన్
సూర్యశ్రీ (అనపర్తి)	: జూనియర్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: జూనియర్
రామకృష్ణ(కోరుకొండ)	: జూనియర్
గీతాసినిమాస్ (సీతానగరం)	: జూనియర్
శ్రీనివాస (గోకవరం)	: జూనియర్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఓ భామ అయ్యో రామ
లలితామహల్(రంపచోడవరం)	: జూనియర్
నవయుగ(చింతూరు)	: జూనియర్





వర్రీ..కాలం!





వరుణకాలం వచ్చిందంటే వరికి ఇబ్బంది ఉండేది కాదు.. చినుకులు పడుతుంటే వరి చేలు పచ్చగా కళకళలాడుతూ కనిపించేవి..అందుకే మెట్టలో ఖచ్చితంగా ఒక పంట అనేవారు.. అయితే నేడు తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో వరి చేలు బీటలు తీస్తున్నాయి..మరో పక్క నాట్లు ఎండిపోతున్నాయి.. దీంతో అన్నదాత ఎలారా దేవుడా అంటూ దిక్కుతోచక కొట్టు మిట్టాడుతున్నాడు. మెట్ట ప్రాంతమైన గోకవరం మండలంలో సుమారు 12 వేల ఎకరాలకు పైగా వరి పంట ఇప్పటికే సాగు చేశారు. వరుణుడు కరు ణించకపోవడం, ఇరుగు పొరుగు నుంచి నీరొచ్చే దారిలేకపోవడం రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. గోకవరం, రంపయర్రంపాలెం,కామరాజుపేట, గాదెలపాలెం, వెదురుపాక, తిరుమలాయపాలెం తదితర గ్రామాల్లో పొలాలు నీరందక అర్రులు చాస్తున్నాయి.ఆయా ప్రాంతాల్లో పంటలను చేజిక్కుంచుకునేందుకు బాధిత రైతులు నానా తంటాలు పడుతున్నారు. మరో వైపు వ్యవసాయాధికారి అందుబాటులో లేకపోవ డంతో పంటను ఎలా దక్కించు కోవాలో తెలియక తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తమకో దారి చూపాలంటూ వేడుకుంటున్నారు. - గోకవరం

శాకంబరిగా కోట సత్తెమ్మ

నిడదవోలు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢమాసం ఆఖరి ఆదివారం కావడంతో నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ శాకంబరిగా దర్శనమిచ్చారు. కోట సత్తెమ్మ తల్లి హోల్‌సేల్ కూరగాయల వర్తక సంఘం వారు రెండు టన్నులకు పైగా వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరి అలంకరణ చేశారు. ఆలయ ఆవరణ అంతా ఆకుకూరలు, కూరగాయలు, వేపాకు దండలతో పచ్చగా కనిపించేలా అలంకరించారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి దర్శనానికి తరలి వచ్చారు.ఆదివారం అమ్మవారికి రూ.2,61,460ల ఆదాయం లభించినట్టు దేవ స్థానం ఈవో తెలిపారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి దుర్గేష్

ఆలయాన్ని ఆధునీకరిస్తాం : దుర్గేష్

ప్రతిష్టాత్మక అఖండ గోదావరి ప్రాజెక్ట్ అంతర్భాగంగా శక్తి స్వరూపిణి కోట సత్తెమ్మ దేవస్థానం అభివృద్ధికి కృషి చేయనున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అమ్మవారిని మంత్రి దుర్గేష్ దర్శించుకుని పూజలు చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి కోట సత్తెమ్మ దర్శనానికి భక్తులు రావడం గమనించామని .. ఆలయం అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించిందన్నారు.ఆలయాన్ని ఆధునీకరిస్తామన్నారు. ఆయ న వెంట ఆలయ ఈవో వి.హరిసూర్య ప్రకాష్, ఆలయ చైర్మన్ దేవులపల్లి రవి శంకర్, మునిసిపల్ కౌన్సిలర్లు పువ్వల రతీ దేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, చిలకల శారదాదేవి, కూటమి నాయకులు ఉన్నారు.

చల్లంగ చూడు తల్లీ!





కడియం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢం వచ్చిందంటే భక్తజనం సారె సమర్పించడం ఆనవాయితీ.. గ్రామదేవతలకు సారె సమర్పిస్తే చల్లంగ చూస్తారని భక్తుల నమ్మకం.. ఈ చిత్రంలోనే చూడండి.. అమ్మవారికి ఎంత తీపి కావిడ సమర్పించారో.. వేమగిరి ముత్యాలమ్మతల్లికి ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా సారె, చీర సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పుట్టింటి ఆడబడుచుగా కొలిచే అమ్మవారికి వివిధ రకాల స్వీట్లు, ఫలాలు తీసుకువచ్చి సారె సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వీట్లు, పువ్వులు, పండ్లను గ్రామమంతా పంచారు.



స్వీకరించమ్మా వేములమ్మ

ఆషాఢం సారె

ఆషాఢంలో గ్రామదేవతల అలయాలకు సారె సమర్పించడం ఆనవాయితీగా ఉంటుంది.. పువ్వులు, పండ్లు, స్వీట్లు అమ్మవారికి సమర్పిస్తారు.. అనంతరం అమ్మవారి ప్రసాదంగా ఊరంతా పంచుతారు. ఆదివారం కొవ్వూరు మండలం వేములూరులో వేములమ్మకు ఒక పెద్ద బండిపై సారె ఉంచి ర్యాలీగా తీసుకెళ్లి అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం ఊరంతా పంచారు. - కొవ్వూరు

దేవుడా.. చూస్తున్నా!



ఉమ్మడి జిల్లాలోని ఒక ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



ఆలయాల భద్రతకు హైటెక్ నిఘా

- జిల్లాలో 1625 ఆలయాలు
- భద్రతకు సర్కారు ప్రణాళిక
- ఇప్పటికే 764 టెంపుల్స్‌లో నిఘా
- 861 ఆలయాల్లో ఏర్పాటుకు ప్లాన్
- రూ.2.27 కోట్లతో అంచనాలు
- ఆభరణాలకు బీమా తప్పనిసరి
- టెంపుల్స్ బాధ్యత ఈవోలదే

నిన్నటి వరకూ ఆలయాల భద్రత దేవుడికెరుక. ఈ నేపథ్యంలో గత వైసీపీ ప్రభుత్వంలో దాడులు జరగని ఆలయం లేదు.. ప్రతి రోజూ ఏదో ఒక చోట ఆలయాల ధ్వంసం ఘటనలు జరుగుతూనే ఉండేవి.. ఎప్పుడు జరిగింది.. ఎలా జరిగిందనేది కనిపెట్టడం పోలీసులకు కత్తి మీద సాముగా ఉండేది.. అయితే కూటమి ప్రభుత్వం వచ్చింది.. దేవుడి సమస్యకు దారి చూపింది.. భద్రత కట్టుదిట్టం చేసే దిశగా చర్యలు చేపడుతోంది. ప్రతి ఆలయంలో నిఘా పటిష్టత దిశగా అడుగుల వేస్తోంది.

కార్పొరేషన్(కాకినాడ), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆలయాల భద్రత చర్యలను పరిశీలిస్తే అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రధాన ఆలయాలతో పాటు, చిన్న ఆలయాల వద్ద ఇదే పరిస్థితి. పలు ఆలయాల్లో నిఘా వ్యవస్థ నిద్దరోతోంది. రాత్రివేళల్లో అయితే కనీస బందోబస్తు కూడా ఉండడంలేదు.ఈ మేరకు ప్రభుత్వం ఆలయాలపై దృష్టి పెట్టింది.ఆలయాల భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసే దిశగా సీసీ కెమెరాలతో హైటెక్ భద్రత చర్యలు చేపడుతోంది. ఆలయాలపై విధ్వంస ఘటనలు, చోరీలు అరికట్టేందుకు ప్రభుత్వం నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. ఆలయ పరిసరాల్లో కెమెరాలు బిగించడంతో పాటు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నారు. ప్రభుత్వానికి నష్టం కలగకుండా, భక్తుల ఆస్తులను కాపాడేందుకు ఐటీ ఆధారిత భద్రతకు శ్రీకారం చుట్టారు.

ఆభరణాలకు బీమా..

ఉమ్మడి జిల్లాలోని దేవాలయాల్లో విలువైన వెండి, బంగారం,ఇతర ఆభరణాలకు బీమా తప్పనిసరి చేశారు. ఇటీవల జరుగుతున్న దొంగతనాలు,అగ్నిప్రమాదాల కారణంగా బీమా అవసరాన్ని ప్రభుత్వం గుర్తించింది. దీంతో విలువైన ఆభరణాల న్ని బీమా చేయించాలని ఒక నిబంధన తెచ్చింది.ఈ మేరకు ఆలయాల్లో ఉన్న వెండి, బంగారం ఆభరణాలకు బీమా తప్పనిసరి చేశారు. విలువైన వస్తువులకు బీమా చేయించడం ద్వారా నష్టాన్ని క్లెయిమ్ చేసుకుని ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా భర్తీ చేయవచ్చు. ఉదాహరణకి గత వైసీపీ ప్రభుత్వంలో అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో రథం కాలిపోయింది. అప్పటికే ఆలయ ఈవో ఆ రథానికి బీమా చేయించారు. దీంతో ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి రూ.98 లక్షలు రికవరీ అయింది. ఉమ్మడి జిల్లాలో 1,182 ఆలయాల్లో విలువైన నగలు ఉండగా 700 దేవస్థానాలకే బీమా చేయించి నట్టు తెలుస్తోంది. మిగిలిన ఆలయాల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

ఆలయాలు 1,625

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,625 ఆలయాలు ఉన్నాయి.వీటిలో 764 ఆలయాల్లో మాత్రమే సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ ఉంది. మిగిలిన 861 ఆలయాలకు నిఘా వ్యవస్థ కొరవడింది. కాకినాడ జిల్లాలో 344 ఆలయాలకు 88 ఆలయాల్లో ఇప్పటికే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.మిగిలిన 256 ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు రూ.64 లక్షల ప్రతిపాదనలు చేశారు.తూర్పుగోదావరి జిల్లాలో 353 ఆలయాలు ఉన్నాయి. వీటిలో 230 ఆలయాల్లో సీసీ కెమెరా వ్యవస్థ ఉంది. మిగిలిన 123 ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు రూ.42 లక్షలతో అంచనా ప్రతిపాదనలు చేశారు. కోనసీమ జిల్లాలో 928 ఆలయాలకు 446 ఆలయాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి. మిగిలిన 482 ఆలయాలకు రూ.1.21 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

అవకతవకలకు అడ్డుకట్ట

పలు ఆలయాల్లో సీసీ కెమెరాలు పటిష్టంగా పనిచేస్తుండడంతో హుండీ లెక్కింపుల్లోను పారదర్శకత పెరిగింది. చోరీలు, అవకతవకలకు అడ్డుకట్ట పడుతోంది. సెలవు రోజులు, బ్రహ్మోత్సవాలు, పండుగల వేళల్లో వేలాదిగా వచ్చే భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు ఈ సాంకేతిక భద్రతా వ్యవస్థ కీలకంగా మారుతోంది. హుండీల లెక్కింపుల్లోనూ నిఘా వ్యవస్థ గట్టిగా పనిచేస్తోంది. ఆలయాలకు వచ్చే ఆభరణాల భద్రతకు నిఘా వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తోంది. అధికారులు పర్యవేక్షిస్తారు. ఇంత పటిష్టమైన భద్రత ఏర్పాట్లు ఉన్నప్పటికీ ఆలయాల్లో దొంగతనాలు దోపిడీలు జరిగితే వాటి పూర్తి బాధ్యత ఆలయ ఈవోలదే అని అధికారలు స్పష్టం చేశారు. సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యత ఈవోలదేనని స్పష్టం చేశారు. సీసీ కెమెరాలు పనిచేయకపోతే వచ్చే పరిణామాలకు ఈవోలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. మొబైల్ యాప్‌ల ద్వారా కెమెరాలను నిత్యం పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

861 ఆలయాలకు.. రూ. 2.27 కోట్లు



గతంలో ఆలయాల్లో జరిగిన దోపిడీ కేసుల్లో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషించాయి. అందుకే 861 ఆలయాల్లో రూ.2.27 కోట్లతో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.ఆలయాల్లో ఆభరణాల బీమా బాధ్యత ఈవోలదే. సీసీ కెమెరా నిఘాలో ఏ విధమైన ఘటనలు జరిగినా బాధ్యత ఈవోలదే.

-డీఎల్‌వీ రమేష్‌బాబు, డిప్యూటీ కమిషనర్, దేవదాయ ధర్మదాయశాఖ

బీజేపీ జిల్లా నూతన కమిటీ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా నూతన కమిటీ (పదాధికారులు)ని జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆదివారం ప్రకటించారు. మొత్తం ఏడుగురు జిల్లా ఉపాధ్యక్షులు, ముగ్గురు జిల్లా ప్రధాన కార్యదర్శులు, ఏడుగురు జిల్లా కార్యదర్శులతో పాటు కోశాధికారి, సోషల్ మీడియా కన్వీనర్, ఐటీ కన్వీనర్లతో కూడిన కమిటీ పేర్లను విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షులుగా పేరిచర్ల సూర్యప్రభావతి, తనుబుద్ధి సూర్యభాస్కరరావు, రంగినీడి గంగాధర్, పాకలపాటి మంగతాయారు, బోడపాటి ముత్యాలరావు, మల్లిడి సురేంద్రరెడ్డి, కందికొండ రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా శెట్టిపల్లి శివ నాగరాజు, మద్దిపాటి రజని, ములగపాటి శివరామకృష్ణంరాజు, జిల్లా కార్యదర్శులుగా బండి సత్యప్రసాద్, పాతూరి రవిశంకర్, గోలు హేమతులసి, గెల్లా శ్రీను, బూరుగుపల్లి శివరామకృష్ణ, చిక్కాల మోహిని, స్వామి సూర్యకిరణ్, కోశాధికారిగా మంచెం విజయకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్‌గా మలపాక కృష్ణమోహన్, ఐటీ కన్వీనర్‌గా సుంకర శ్యాంబాబులను నియమించారు.

నేడు బిక్కవోలులో పీజీఆర్ఎస్‌కు కలెక్టర్

బిక్కవోలు, జూలై 20(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్(పీజీఆర్ఎస్)కు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి హాజరవుతారని ఎంపీడీవో వి.శ్రీనివాస్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ కలెక్టర్ అందుబాటులో ఉంటారన్నారు. మండల ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపడతారన్నారు.మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. జిల్లా కలెక్టరేట్ సోమవారం యథావిధిగా పీజీఆర్ఎస్ జరుగుతుందని పేర్కొన్నారు.

డ్రిప్.. నో గ్రిప్!



డ్రిప్ ఇరిగేషన్ పథకం ఏర్పాటు చేస్తున్న అధికారులు

- రైతుల చిన్నచూపు
- రాయితీలు ఉన్నా నిర్లక్ష్యం
- ముందుకు రాని రైతాంగం
- నెరవేరని సర్కారు లక్ష్యం
- నేటికీ అవగాహనా లోపమే
- 3,800 హెక్టార్లు లక్ష్యం
- 169.15 హెక్టార్లకే పరిమితం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు (ఏపీ ఎంఐపీ) అనే సూక్ష్మనీటి సాగు పథకం..దీనినే డ్రిప్ ఇరిగేషన్ అని అంటారు. డ్రిప్ ఇరిగేషన్ అంటే ప్రతి మొక్కకు ఓ పైపు ద్వారా నీటిని పంపిస్తారు. తుంపర్లు అంటే వాన తుంపర్లు పడినట్టు నీటిని జల్లే విధానం. తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసుకోవచ్చు. కనీసం 10 సెంట్ల భూమి ఉన్నా నీటి సదుపాయం ఉంటే చాలు రాయితీతో ఈ పథకాన్ని ఉపయోగించుకోవచ్చు.2003 నవంబరు నుంచి వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమలకు సంబంధించిన పంటలకు ప్రభుత్వం రాయితీ ద్వారా సూక్ష్మనీటి సాగులో భాగంగా డ్రిప్ (బిందు), తుంపర సేద్యాన్ని ప్రోత్సహిస్తోంది. నీటిని వృథా చేయకుండా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయవచ్చు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో మొత్తం 3800 హెక్టార్లలో బిందు సేద్యం, తుంపర సేద్యంను ప్రోత్సహించడం లక్ష్యంగా ఉంది. జిల్లాలో మండలాల వారీ సూక్ష్మనీటి సాగుపథకం నత్తనడకన సాగుతోంది. మొత్తం జిల్లాలో 2282 మంది రైతు 2753.64 హెక్టార్ల కోసం ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కానీ ఇప్పటి వరకూ కేవలం 111 మంది రైతులకు సంబంధించిన 169.15 హెక్టార్లలో మాత్రమే అమలైంది.రాజమండ్రి డివిజన్‌లో 722 మంది రైతులు 799.78 హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కానీ ఇప్పటి వరకూ 22 మంది రైతులకు చెందిన 28.75 హెక్టార్లలో మాత్రమే పథకం అమలైంది. కొవ్వూరు డివిజన్‌లో 1560 మంది రైతులు 1953.86 హెక్టార్లలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.అందులో ఇప్పటి వరకూ 89 మంది రైతులకు సంబంధించిన 140.40 హెక్టార్లలో మాత్రమే పథకం అమలైంది.కొ న్ని మండలాల్లో ఒకటి కూడా అమలు కాలేదు.

రాయితీ వివరాలు



చిన్న రైతులైన ఎస్సీ, ఎస్టీలకు 2 హెక్టార్ల వరకూ 100 శాతం రాయితీ ఇస్తారు. ఇతర చిన్నరైతులకు రెండు హెక్టార్ల వరకూ బిందు సేద్యానికి 90 శాతం రాయితీ అంటే రూ.2.18 లక్షలు వరకూ ఇస్తారు. సన్నకారు రైతులకు 2 హెక్టార్ల నుంచి 4 హెక్టార్ల వరకూ 70 శాతం రాయితీ అంటే రూ.3.10 లక్షలు ఇస్తారు. పెద్ద రైతులైతే 4 నుంచి 5 హెక్టార్ల వరకూ బిందు సేద్యానికి 50 శాతం రాయితీ అంటే రూ.4 లక్షల వరకూ ఇస్తారు. అందరు రైతులకు తుంపర సేద్యానికి 50 శాతమే రాయితీ..అంటే రూ.19 వేలు ఇస్తా రు.. కనీసం 10 సెంట్ల స్థలం ఉండి సాగు చేస్తున్నా పథకానికి అర్హులే. తప్పనిసరిగా నీటి సదుపాయం ఉం డాలి. రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలి. బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్ చేస్తారు. ఫీల్డ్ సర్వే చేసి, రైతు ఆధార్ కార్డు, పాస్‌బుక్ ఆధా రంగా ఎంపిక చేస్తారు. సబ్సిడీ మినహా మిగిలిన సొమ్మును చెల్లించిన తర్వాతే అధికారులు డ్రిప్ ఇరిగేషన్, తుంపర సేద్యం ఏర్పాట్లు చేస్తారు. ఏడేళ్ల వరకూ మరమ్మతులను ప్రభుత్వమే భరిస్తుంది.

మండలాల వారీ ఇలా..

మండలం	రిజిస్ట్రేషన్	హెక్టార్లు	మంజూరు	హెక్టార్లు
కొవ్వూరు	31	25.84	4	3.36
చాగల్లు	135	180.11	12	18.58
తాళ్లపూడి	45	68.51	4	7.29
నిడదవోలు	48	54.62	3	4.89
ఉండ్రాజవరం	3	3.18	0	0
పెరవలి	10	9	4	3.69
దేవరపలి	369	501.63	15	32.34
గోపాలపురం	383	481.43	9	12.79
నల్లజర్ల	536	629.54	38	57.46
సీతానగరం	81	78.74	1	0.69
కోరుకొండ	95	92.86	2	1.07
గోకవరం	90	100.50	2	1.19
రంగంపేట	275	285.10	13	18.3
రాజానగరం	116	160.53	1	1.13
రాజమండ్రి రూరల్	11	9.67	0	0
కడియం	22	14.64	2	1.36
అనపర్తి	7	14.51	0	0
బిక్కవోలు	25	43.23	1	5
మొత్తం	2282	2753.64	111	169.15



సెంట్రల్ జైలు వద్ద వైసీపీ శ్రేణుల హంగామా.. పోలీస్ వాహనంలో ఎంపీ మిథున్‌రెడ్డి తరలింపు

సెంట్రల్ జైల్‌కు ఎంపీ మిథున్‌రెడ్డి

లిక్కర్ స్కామ్‌లో ఏ4 - ఆగస్టు 1 వరకు రిమాండ్

రాజమహేంద్రవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : లిక్కర్ స్కామ్ కేసులో ఎ4, వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని ఆదివారం రాత్రి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. విజయ వాడ ఏసీబీ కోర్టు మిథున్‌రెడ్డికి ఆగస్టు 1వ తేదీ వరకూ రిమాండ్ విధించడంతో సిట్ టీమ్ డీజీ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 8.38 గంటలకు రాజమండ్రి సెంట్రల్ జైలుకు తీసుకొచ్చారు.జక్కంపూడి గణేష్, కొందరు యువకులు వైసీపీ జెండాలతో వచ్చి సెంట్రల్ జైలు ఎదురుగా రోడ్డుపై సుమారు 2 గంటల పాటు బైఠాయించి హంగామా సృష్టిం చారు.పోలీసులు ముందుగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయకపోవడంతో నేరుగా జైలు గేటు వరకూ వైసీపీ కార్య కర్తలు, నేతలు వచ్చారు. దీంతో పోలీసులు అప్రమత్తమై సెంట్రల్ జైల్ రోడ్ అటూ ఇటూ బ్లాక్ చేశారు. ఇన్‌చార్జి ఎస్పీ మురళీకృష్ణ నాయకత్వంలో అడిషనల్ ఎస్పీలు సుబ్బరాజు, చెంచురెడ్డి, ముగ్గురు డీఎస్పీలు, పలువురు సీఐలు, ఎస్ఐలు, సుమారు 60 మంది పోలీసులు అక్కడ మోహరించారు. నిఘా విభాగాలు రంగంలోకి దిగాయి. రోప్ పార్టీ వచ్చింది. సెంట్రల్ జైలు వద్ద సెక్షన్ 30 అమల్లో ఉందని.. రోడ్డుపై ఎవరూ ఉండవద్దని హెచ్చ రించారు. ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, అప్పిరెడ్డి సెంట్రల్ జైలు ప్రధాన గేట్ వద్దకు వెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీ సులు అడ్డుకు న్నారు.దీంతో కాసేపు వాగ్వాదం జరిగింది. అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ వారిద్దరినీ బయటకు పంపించారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్,మాజీ ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, తలారి వెంకట్రావు, సత్తి సూర్యనారాయణ రెడ్డి, గూడూరి శ్రీనివాస్ తదితరులు సెంట్రల్ జైలు వద్దకు వచ్చారు. ముందుగా పెద్ద హడావుడి చేసిన వైసీపీ శ్రేణులు మిథున్‌రెడ్డిని తీసుకొచ్చిన సమయంలో కిక్కురుమనకపోవడం గమనార్హం. జైలు అధికారులు వైసీపీ నేతలను ఎవరినీ లోపలకు అనుమతించ లేదు. జైలు అధికారులు లాంఛనాలు పూర్తిచేసి ఎంపీ మిథున్‌రెడ్డిని సెంట్రల్ జైలు రిమాండ్‌లో ఉంచారు.

ధర్మవరంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం ధర్మవరంలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరై ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు. అనంతరం గ్రామానికి చెందిన హరిదాసుల పోసిరత్నంకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 18,000 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, గారపాటి వెంకటకృష్ణ, చింతపల్లి సతీష్, నేరేడుమిల్లి నాగమణి, కుందుల సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

కొవ్వూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమాన వేతనం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారంతో ఐదో రోజుకు చేరుకుంది. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు సుందరబాబు మాట్లాడుతూ కార్మికులకు గ్రాట్యూటీ, పెన్షన్, వారసులకు ఉద్యోగాలు, కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే గతంలో జీవో 279 ఒప్పంద కాంట్రాక్టు కార్మికులుగా పనిచేసిన వారందరినీ గత ప్రభుత్వం ఆప్కాస్ వ్యవస్థ ద్వారా నేరుగా జీతాలు చెల్లించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం దాన్ని తొలగించి, తిరిగి కాంట్రాక్టు విధానాన్ని తీసుకురావాలని చేస్తున్న ప్రయత్నాలు దుర్మార్గమన్నారు. సమస్యలపై కార్మికులంతా ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో బి.రవీంద్ర, పి.వాసు, కె.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా గెల్లా శ్రీనుబాబు



శ్రీనుబాబు

గోపాలపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బీజేపీ జిల్లా కార్యదర్శిగా గోపాలపురానికి చెందిన గెల్లా శ్రీనుబాబు ఆదివారం నియమితులయ్యారు. ఈయన 1999 నుంచి ఆర్ఎస్ఎస్ సభ్యుడిగా, 2014 నుంచి గోపాలపురం పట్టణ అధ్యక్షుడిగా సమర్థవంతంగా పనిచేశారు. తర్వాత 2015-2025 వరకు మూడు పర్యాయాలు గోపాలపురం మండల బీజేపీ మండల అధ్యక్షుడిగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన మండల అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహి స్తున్నారు. ఆదివారం జిల్లా కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఎంపీ పురందేశ్వరి సమక్షంలో ఈయనకు జిల్లా కార్యదర్శిగా నియమించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. అందులో భాగంగానే 1999 నుంచి నేటి వరకు పార్టీ కోసం చేసిన సేవలు జిల్లా కమిటీ గుర్తించి తనకు జిల్లా కమిటీలో స్థానం కల్పించారని అన్నారు. జిల్లా కార్యదర్శిగా పార్టీ అభివృద్ధి కోసం మరింత ఉత్సాహంతో పని చేస్తానని అన్నారు. తనకు జిల్లా కమిటీలో స్థానం కల్పించేందుకు సహకరించిన ఎంపీ పురందేశ్వరికి, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్రకు కోర కమిటీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నల్లజర్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెం సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మార్పు కారణంగా సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదువరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పదవులు బాధ్యతను పెంచుతాయి

- కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- అట్టహాసంగా 'పశివేదల' సహకార పరపతి సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం
- ముఖ్యఅతిథిగా ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు హాజరు



నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, అచ్చిబాబు

కొవ్వూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పదవులు మరింత బాధ్యతను పెంచుతాయని, నూతనంగా సొసైటీల్లో బాధ్యతలు చేపట్టిన పాలకవర్గాలు రైతులకు మరిన్ని సేవలు అందించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం పశివేదల ది రంగరాయ విశాల సహకార పరపతి సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గారపాటి రామచంద్రరావు, డైరెక్టర్లుగా వేములపల్లి రత్న రాజేంద్ర, గుణపరెడ్డి శ్రీనివాసరావుతో ఎమ్మెల్యే ముప్పిడి, ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. సొసైటీ కార్యదర్శి కరుటూరి శ్రీనివాసరావు సొసైటీ ప్రగతి గురించి వివరించారు. అనంతరం సొసైటీ నూతన అధ్యక్షుడు రామచంద్రరావును పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందజేయడంతో పాటు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు అందించడమే లక్ష్యంగా సహకార సంఘాలను ఎన్టీఆర్ సీఎం అయిన తరువాత ప్రవేశపెట్టారన్నారు. ఈ సంఘాల ద్వారా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందించడం జరిగిందన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు రైతులకు, వ్యవసాయానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. ఆంధ్రాసుగర్స్ జేఎండీ, సీనియర్ టీడీపీ నేత పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) మాట్లాడుతూ సొసైటీ ఎన్నికలను రాజకీయం చేయొద్దని, వీలైనంత వరకు రాజీ చేసుకుని సొసైటీలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, గారపాటి శ్రీనివాసరావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు, గారపాటి శివరామకృష్ణ, బేతిన నారాయణ, ఉండవల్లి గోపాల్, తుంపల్లి ఆదినారాయణ, సూదిన శ్రీనివాస్, రాయపాటి సుబ్బారావు, యలమాటి మోహనరావు, వట్టికూటి వెంకటేశ్వరరావు, గొరిజాల సురేష్, చావా శ్రీనివాసరావు, గారపాటి రామకృష్ణ, యూవీఎస్ నారాయణ, బీజేపీ నాయకులు కోడూరి లక్ష్మీనారాయణ, పరిమి రాధ, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పిల్లలమర్రి మురళీకృష్ణ, ముప్పరాజు శ్రీనివాస్, కొప్పిరెడ్డి రాజబాబు, తాడిమళ్ల విజయవాణి, జనసేన నాయకులు రేకమండ రమేష్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు

ఉల్లింద్రమ్మ వారి ఆలయ వార్షికోత్సవం



ఉల్లింద్రమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

దేవరపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి, బుచ్చయ్యపాలెం రోడ్డులో గల ఉల్లింద్రమ్మ వారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యే పూజా కార్యక్రమాలు, భజనలు చేశారు. దీనిలో భాగంగా భారీ అన్నసమారాధన ఏర్పాటు చేయగా, వేలాది మంది భక్తులు వచ్చి పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ యాగంటి హనుమంతరావు, ఏలిన వీరవెంకట్రావు, యాగంటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశిష్ట హోమాలు



కావిడి మహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కొవ్వూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలో వేంచేసియున్న లలితపార్వతీ సమేత గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో ఉప ఆలయంగా ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి ఆదివారం ఆలయ అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో విశిష్ట హోమాలు, అభిషేకాలు చేశారు. ఉదయం భక్తులు కావిడి మోస్తూ పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, సుబ్రహ్మణ్య మూలమంత్ర హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. సాయంత్రం దీపోత్సవం నిర్వహించారు. పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ఉండ్రాజవరంలో ఉచిత వైద్యశిబిరం

ఉండ్రాజవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మపీఠంలో సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ పీఠాధిపతి అనాలయో ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో ఉచితంగా మందులు, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు అందజేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత

నల్లజర్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించినట్టు మానవత సంస్థ జిల్లా కన్వీనర్ కండెపు వెంకట సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం నల్లజర్ల హైస్కూల్‌లో ఉత్తమ విద్యార్థులకు నగదు బహూకరించారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండలాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి ప్రత్తిపాటి రాంబాబు, మాజీ అధ్యక్షుడు గుళ్ళపూడి వెంకటరత్నం, ఐడీవీ అప్పారావు, దావులూరి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు ఆడుతున్న ఆరుగురి అరెస్ట్



అరెస్టు చేసినవారితో ఎస్ఐ బాలాజీ సుందరరావు

నిడదవోలు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కోరుమామిడిలో ఆదివారం కోడిపందేలు ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ సుందరరావు తన సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. ఇందులో ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ. 1150 నగదు, మూడు బైకులు, రెండు కోళ్లు, నాలుగు కత్తులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

సారా బట్టీలపై పోలీసుల దాడులు

తాళ్లపూడి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ సూచనలతో మండలంలోని పోలీసులు ఆదివారం సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా సూరయ్యపేట, బీమోలు సరిహద్దు ప్రాంతంలోని మారుమూల చింతలపూడి కెనాల్ కాలువ గట్టు వద్ద సారా కాస్తున్నారన్న సమాచారంతో అక్కడకి వెళ్లి పరిశీలించగా నాలుగు పీపాల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ సారా, పేకాట, కోడి పందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంటుందని హెచ్చరించారు.

కేఎస్ చక్రవర్తి నూతన నియామకం



రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజనీర్ల అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

కొవ్వూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజనీర్ల అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కేఎస్ చక్రవర్తి నియమితులయ్యారు. ఆదివారం విజయవాడ యూటీఎఫ్ భవనంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజనీర్ల అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. ఎన్.మల్లిఖార్జునరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా కొవ్వూరు పట్టణ హౌసింగ్ ఏఈ కేఎస్ చక్రవర్తి, జనరల్ సెక్రటరీగా చిత్తూరుకు చెందిన ఎన్.శ్రీరాములురెడ్డి, కోశాధికారిగా కోనసీమ జిల్లాకు చెందిన డి.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో 26 జిల్లాలకు చెందిన వారికి చోటు కల్పించారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలియజేశారు.

హామీలు అమలుచేయడంలో సీఎం విఫలం



నిరసన ప్రదర్శనలో మాట్లాడుతున్న చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

కొవ్వూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలను అబద్ధాలతో సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. కొవ్వూరు లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో ఆదివారం వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధ్యక్షతన బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో సీఎం చంద్రబాబు నాయుడి ప్రభుత్వం విఫలం చెందారన్నారు.కార్యక్రమంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, కోడూరి శివరామకృష్ణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంటమణి రమేష్‌బాబు, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ఆషాఢం సారె సమర్పణ

- భారీగా ఊరేగింపులు, ప్రత్యేక పూజలు నిర్వహణ
- పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళా భక్తులు, తదితరులు



చాగల్లులో సారె కావిడలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



తూర్పుచోడవరంలో ముత్యాలమ్మకు సారె సమర్పించిన దృశ్యం



దేవరపల్లిలో బంగారు పాపమ్మతల్లికి సారె సమర్పిస్తున్న మహిళా భక్తులు

కొవ్వూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వేములూరు గ్రామదేవత వేములమ్మ వారికి గ్రామస్థులు ఆదివారం ఆషాఢమాసం సారెను సమర్పించారు. ఉదయం కొటికలపూడి అబ్రహం లింకన్ ఇంటి నుంచి సారె, పట్టువస్త్రాలను గ్రామోత్సవంగా నిర్వహిస్తూ, మేళతాళాలతో ఆలయానికి తీసుకువెళ్లి సమర్పించారు. మంగళ వాయిద్యాలు, మేళాతాళాలు, చిన్నారుల కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మహిళలు, తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నల్లజర్ల: చీపురుగూడెం గ్రామదేవత తుమ్మలమ్మ తల్లి, తెలికిచర్ల గ్రామ దేవత అంకాలమ్మ తల్లి, తూర్పుచోడవరం గ్రామదేవత ముత్యాలమ్మ తల్లికి గ్రామస్థులు ఆదివారం ఆషాఢం సారె సమర్పించారు. ఉదయం ఆయా ఆలయాల వద్దకు మహిళలు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ ఊరేగింపుగా తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్చుతూ అమ్మవార్లను ఊరేగించారు. చీపురుగూడెంలో భక్తులు అన్ని దేవాలయాలను తిరిగి దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, పెద్ద ఎత్తున చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే అచ్చన్నపాలెం గ్రామదేవత గంగాదేవమ్మ వారికి గ్రామస్థులు ఆషాఢమాసం సారె సమర్పించారు.భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: మండల కేంద్రమైన చాగల్లు గ్రామదేవత పాటెమ్మ వారికి స్థానిక మహిళలు ఆదివారం ఆషాఢం సారె సమర్పించారు. పాత పాటెమ్మ వారి ఆలయం నుంచి భక్తులు ఊరేగింపుగా బయలు దేరి గ్రామంలోని ప్రధాన ఆలయాలను చేరుకుని దేవతలను దర్శించుకున్నారు. ఊరేగింపు అనంతరం తిరిగి పాత పాటెమ్మ వారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ పిండి వంటలతో అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో కొలువై ఉన్న బంగారుపాపమ్మ వారికి ఆదివారం ఆషాఢం సందర్భంగా సారె, చీర, పండ్లు, స్వీట్లు, పసుపు, కుంకుమ, గాజులను మహిళా భక్తులు సమర్పించారు. దీనిలో భాగంగా ఆలయం వద్ద పాలపొంగులు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉండ్రాజవరం: వేలివెన్నులో మహంకాళమ్మ వారిని ఆదివారం కూరగాయలతో శాకాంబరి మాతగా అలంకరించారు. తొలుత కుంకుమ పూజలు, అభిషేకాలు జరిపారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో శాకాంబరిగా దర్శనమిస్తున్న మహంకాళమ్మ వారు

ఆకట్టుకుంటున్న 'మానవత' పై పాట

ఉండ్రాజవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పాలంగికి చెందిన కవి కోట రామప్రసాద్ మానవత సేవా సంస్థపై రాసిన పాట శ్రోతల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. వివిధ సేవాకార్యక్రమాలకు సంబంధించి గేయాన్ని రచించాడు. విద్య, వైద్యం, సామాజిక సేవాకార్యక్రమాలు వంటి నిర్వహణపై రచించిన ఈ పాట సినీ గాయకులతో పాడించి రికార్డు చేయించారు. ఈ పాట వినసొంపుగా, అర్థవంతంగా ఉండటంతో సాంఘిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేశారు. మానవత్వం పరిమళించి గుబాళిస్తున్న ఓ మానవతా... అంటూ ఐదు చరణాలు, 20 వాక్యాల్లో పాటను రచించారు. కవి రామప్రసాద్ మాట్లాడుతూ తాను రాసిన గేయాన్ని వాట్సాప్‌లు, ఇతర మాధ్యమాల్లో ప్రచారం జరిగినందుకు అభినందనలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా మానవతా సంస్థ ప్రతినిధులు రామప్రసాద్‌ను అభినందించారు.

వైసీపీ చేసిన మంచి పనులు ప్రజలకు వివరిద్దాం

- మాజీ హోంమంత్రి తానేటి వనిత

నల్లజర్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వైసీపీ హయాంలో చేసిన మంచి పనులను ప్రజలకు వివరించాలని గోపాలపురం నియోజకవర్గ వైసీపీ కన్వీనర్, మాజీ హోంమంత్రి తానేటి వనిత అన్నారు. ఆదివారం నల్లజర్లలో వైసీపీ మండలాధ్యక్షుడు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఆమె మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, మహిళ మండలాధ్యక్షురాలు వై.లక్ష్మి, పెండ్యాల వీరాఘవులు, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, నక్కా పండు, తానిగడప శ్రీనివాసరావు, సాంబ పాల్గొన్నారు.

సాధారణ స్థాయిలో గోదావరి ప్రవాహం

- 49 వేల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవాహం సాధారణ స్థాయిలో కొనసాగుతోంది. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 49,422 క్యూసెక్కులు ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పు డెల్టాకు ఐదు వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 6700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎగువన భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 12.70 అడుగులుగా నమోదైంది.

బరువు 1.800 కిలోలు... ధర రూ.22 వేలు

- యానాం మార్కెట్‌లో పులస



యానాం మార్కెట్‌లో పులసతో మత్స్యకార మహిళ రత్నం

యానాం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): యానాంలో వేటకు వెళ్లిన మత్స్యకారుడి వలకు కిలో 800 గ్రాముల బరువు ఉన్న పులస చిక్కింది. దీనిని ఆదివారం యానాం మార్కెట్‌లో పోనమండ భద్రం, రత్నం దంపతులు రూ.22వేలకు పాడి దక్కించుకున్నారు. గౌతమి గోదావరిలో ఎర్రనీరు పోటెత్తిన సమయంలో పులసలు లభ్యమవుతాయి. వారం రోజుల క్రితం యానాం మార్కెట్‌కు తొలి పులస వచ్చి రూ.18వేల ధర పలికిన విషయం తెలిసిందే. అయితే రానున్న వరదకు మరిన్ని పులసలు దొరికే అవకాశం ఉందని మత్స్యకారులు చెప్తున్నారు.